ఉష్ణోగ్రత (అంచనా) 13-5-2025	గరిష్టం	కనిష్టం
గుంటూరు	42	28
తెనాలి	42	28
నరసరావుపేట	41	27
బాపట్ల	39	29
రెంటచింతల	42	28
చీరాల	39	29

రాయితీ పథకం.. లక్ష్యానికి దూరం

- సబ్సిడీ యంత్రాలపై అన్నదాతల అనాసక్తి!
- ధరల్లో భారీగా తేడా ఉండడమే కారణమా?
- ప్రభుత్వం కేటాయించిన నిధులు పూర్తిగా ఖర్చు కాని వైనం



రాయితీపై సేద్య పరికరాలను అందించే విధానాన్ని గత ప్రభుత్వం పూర్తిగా తెరమరుగు చేసి అన్నదాతల ప్రయోజనాలకు గండి కొట్టింది. ఈ ప్రభుత్వం తిరిగి ఆ పథకాన్ని పునరుద్ధరించింది. రాయితీ పొందడానికి మార్గదర్శకాలు విడుదల చేయడమే కాకుండా మూడు జిల్లాలకు నిధుల కేటాయింపు, పరికరాల లక్ష్యాన్ని కూడా నిర్దేశించింది. మామూలుగా అయితే రాయితీ పరికరాల కోసం రైతాంగం నుంచి పెద్ద ఎత్తున దరఖాస్తులు రావాల్సి ఉంది. కానీ అనూహ్యంగా స్పందన అంతంతమాత్రంగా ఉండడమే కాకుండా నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికే వ్యవసాయశాఖ ఆపసోపాలు పడాల్సి వచ్చింది.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

వ్యవసాయ పరికరం ధరను బట్టి ప్రభుత్వం ఇస్తున్న రాయితీ 10,000 నుంచి 50,000 వరకు ఉంది. అది పోను మిగిలిన మొత్తాన్ని అన్నదాతలు చెల్లించి పరికరాలను పొందే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. కానీ ఇక్కడే సదరు యంత్రాలను సరఫరా చేసే కంపెనీల మాయాజాలం నడిచినట్లు తెలుస్తోంది. సబ్సిడీ మొత్తం పోనూ రైతు చెల్లించే ధర కూడా కలుపుకుంటే బయటిమార్కెట్ కన్నా ఎక్కువగా ఉన్నట్లు రైతులు గుర్తించారు. నిజానికి ఇది ప్రభుత్వ ఖజానాకు గండికొట్టడమే. కానీ

జిల్లాల వారీగా కేటాయింపులు ఇలా..

ఐదేళ్ల పాటు అమలుకు నోచుకోని రాయితీపై వ్యవసాయ పరికరాలను అందించే కార్యక్రమానికి ప్రస్తుత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా విధివిధానాలను మూడు నెలల క్రితమే జారీ చేయడంతో పాటు జిల్లాల వారీగా లక్ష్యాలనూ నిర్దేశించింది. బాపట్ల జిల్లాకు సంబంధించి కేటాయించిన నిధులు రూ.2.70 కోట్లు కాగా అందించాల్సిన యూనిట్లను 1,400గా తెలిపింది. అదే విధంగా గుంటూరు జిల్లాకు వచ్చేసరికి నిధులు రూ.2.60 కోట్లుకాగా యూనిట్ల సంఖ్య 1,410గా ఉంది. పల్నాడు జిల్లాలో నిధులు రూ.2.75 కోట్లు కాగా యూనిట్ల సంఖ్యను 1,470గా వ్యవసాయశాఖ ప్రకటించింది. అవసరాన్ని బట్టి నిధుల పెంపుపై కూడా నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వం తెలిపింది.

బ్రాండెడ్ లేదా గ్యారెంటీల ముసుగుతో కొటేషన్లు ఎక్కువగా ఇచ్చి కంపెనీల డీలర్లు పబ్బం గడుపుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ ధరలు బేరీజు వేసుకున్న రైతాంగం రాయితీ యంత్ర పరికరాలపై ఆది నుంచి విముఖత ప్రదర్శిస్తూనే ఉన్నారు. మండలాల వారీగా అధికారులకు నిర్దేశిత లక్ష్యాలు ఇచ్చి వాటిని పూర్తి చేయాలని మెడమీద కత్తిపెట్టి వ్యవసాయశాఖ పనిచేయించింది. మార్చి చివరికే తుది గడువుగా తొలుత ప్రకటించిన ప్రభుత్వం స్పందన నిరాశజనకంగా ఉండడంతో గడువును పెంచుకుంటూ వచ్చింది. ఈనెల మొదటి వారంతో దరఖాస్తుల ప్రక్రియ నిలిపివేసినట్లు వ్యవసాయశాఖ తెలిపింది. మూడుసార్లు గడువు పొడిగించినా, సిబ్బందిపై తీవ్ర ఒత్తిడి తెచ్చినా పరికరాల లక్ష్యం చేరుకోవడంలో

వందశాతం చేరుకోవడంలో విఫలం..

జిల్లాల వారీగా కేటాయించిన నిధులే అంతంతమాత్రంగా ఉంటే గడువు పూర్తయ్యేసరికి ఎక్కడా కూడా వందశాతం లక్ష్యాలను చేరుకున్న దాఖలాలు లేవు. బాపట్ల జిల్లాకు మంజూరు చేసిన 1,400 యూనిట్లకు 1100కు మాత్రమే అనుమతులు మంజూరు అయ్యాయి. రూ.2.10 కోట్ల నిధులనే యంత్రాంగం ఖర్చు చేయగా ఇంకా రూ.60 లక్షల నిధులు అలానే ఉన్నాయి. గుంటూరు, పల్నాడు జిల్లాల్లోకూడా కేటాయించిన నిధులు, యూనిట్లు మంజూరులో కూడా 75 శాతమే చేరుకున్నట్లు గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి. ఐదేళ్ల పాటు మూలన పడేసిన ఓ పథకాన్ని ఈ ప్రభుత్వం తిరిగి పునరుద్ధరిస్తే వేలల్లో దరఖాస్తులు రావాల్సి ఉండగా నిర్దేశించిన లక్ష్యం చేరుకోవడమే గగనమై పోయింది.

మాత్రం వ్యవసాయశాఖ వెనకబడే ఉంది. రాయితీ కోసం ఎగబడాల్సిన రైతాంగం దానిని కాదనుకునే విధంగా వ్యవహరించడం వెనక ఉన్న కారణాలపై దృష్టి పెట్టే పనే వ్యవసాయశాఖ చేయలేదు. సబ్సిడీపై క్షేత్రస్థాయిలో రైతాంగానికి అవగాహన కల్పించడంపై వ్యవస్థల వైఫల్యం కూడా ప్రస్తుత పరిస్థితికి కారణంగా ఉంది. పైగా అన్నదాతల దగ్గర డబ్బులు లేకపోవడం కూడా లక్ష్యాలను చేరుకోకపోవడానికి కారణంగా ఉందనే వాదనను యంత్రాంగం చేయడం విస్తుగొలిపే విధంగా ఉంది

లోపం ఎక్కడ జరిగింది...

రోటోవేటర్ ధరలు కనిష్ఠంగా రూ.80,000 దగ్గర నుంచి రూ.1,50,000 వరకు ప్రభుత్వం మార్గదర్శకాలలో పేర్కొంది. ఇందుకు సంబంధించి రైతుకు అందే రాయితీ రూ.50,000 వరకు ఉంది. సబ్సిడీపోనూ రైతు చెల్లించే మొత్తం కలుపుకుంటే ఈ ధర బయటి మార్కెట్ కన్నా కూడా రూ.30,000 వరకు అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో అన్నదాతకు సబ్సిడీ వచ్చినా కానీ చెల్లించే మొత్తం దాదాపు బయటి ధరకు సమానంగా ఉండడమే ఈ స్థితికి కారణంగా ఉన్నట్లు తెలుస్తోంది.



చిన్నారులపై.. వాత్సల్యం!



- 'మిషన్ వాత్సల్య' పథకానికి ప్రభుత్వం శ్రీకారం
- అనాథ, నిరుపేద పిల్లలకు నెలకు రూ. 4వేల ఆర్థిక సహాయం
- తన వాటాగా రూ. 19.12 కోట్లు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- లబ్ధిదారుల గుర్తింపు బాధ్యత అంగన్వాడీలదే!

అనాథ పిల్లలను ఆదుకోవడం కోసం రాష్ట్ర ప్రభుత్వం మరో పథకానికి శ్రీకారం చుట్టింది. 'మిషన్ వాత్స ల్య' పేరుతో అనాథ పిల్లలకు నెలనెలా ఆర్థిక సహాయం అం దించడం తోపాటు, వారి సంరక్షణకు అడుగులు వేస్తోంది. అందులో భాగంగా తాజాగా రూ. 19.12 కోట్లు విడుదల చేసిం ది. దీంతో అనాథ పిల్ల లకు గొప్ప భరోసా లభించినట్లయింది.

గుంటూరు, మే12(ఆంధ్రజ్యోతి): 'మిషన్ వాత్సల్య' అనేది కేంద్ర ప్రాయోజిత పథకం. ఈ పథకాన్ని 2021 లోనే కేంద్ర ప్రభుత్వం ప్రకటించినప్పటికీ గత ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. తాజాగా కూటమి ప్రభుత్వం ఆ పథకాన్ని అనాథలైన చిన్నారులకు అందుబాటులోకి తెచ్చింది. కేంద్ర ప్రాయోజిత పథకమైన 'మిషన్ వాత్సల్య'కు కేంద్రం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు కేటాయించాలి. తాజాగా కూటమి ప్రభుత్వం తనవంతు వాటాగా 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికి రూ. 19.12 కోట్లు నిధులు విడుదల చేసింది. దీంతో పథకం అమలు లాంఛనప్రాయమయింది.

నెలకు రూ. 4వేలు ఆర్థిక సహాయం

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అనాథ చిన్నారులకు నెలకు రూ.4 వేల చొప్పున మిషన్ వాత్సల్య పథకం ద్వారా ఆర్థిక సహాయం చేస్తారు. ఆదరణ లేని అభాగ్యులు, అనాథ బాలలకు విద్య, వైద్య అవసరాలు తీర్చడం కోసమే ఈ మొత్తాన్ని ఇస్తున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. ఈ పథకం కేంద్ర ప్రభుత్వ పథకం అయినప్పటికీ లబ్ధిదారుల ఎంపిక రాష్ట్ర ప్రభుత్వమే చే పడుతుంది. లబ్ధిదారుల సంఖ్య ఆధారంగా నిధుల కోసం కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు చేయాల్సి ఉంటుంది.

● అర్హులు ఎవరంటే..

బాలల న్యాయ చట్టం 2015 ప్రకారం సంరక్షణ ఆదరణ అవసరమైనవారు ఈ పథకానికి అర్హులవుతారు. వితంతువులు, లేదా విడాకులు తీసుకున్న తల్లి సంరక్షణలో ఉండే పిల్లలు, తల్లిదండ్రులు ఇద్దరినీ కోల్పోయి ఇతరుల వద్ద ఆశ్రయం పొందుతున్న అనాథలు, ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న తల్లిదండ్రుల బిడ్డలు, పోషించే స్థోమతలేని తల్లిదండ్రుల పిల్లలు, బాలకార్మికులు, బాల్యవివాహాలు, అక్రమరవాణాకు గురైనవారు, హెచ్ఐవీ బాధితుల పిల్లలు, దివ్యాంగులు, తప్పిపోయిన, పారిపోయిన, యాచక చిన్నారులు, వీధుల్లో నివసిస్తున్న, హింసకు, దోపిడీకి గురైన చిన్నారులు, అనాథాశ్రమాల్లో ఉంటూ మద్దతు పునరావాసం అవసరమైన పిల్లలు ఈ పథకానికి అర్హులుగా ఉంటారు.

● అర్హతలు ఇలా..

మిషన్ వాత్సల్య పథకం కోసం దరఖాస్తు చేసేవారి కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.72 వేలు, పట్టణ ప్రాంతాలవారికి రూ.98 వేలకు మించి ఉండకూడదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన తల్లికి వందనం పథకం వర్తించేవారికి ఈ పథకం వర్తించదు.

● పరిశీలన ఇలా..

మిషన్ వాత్సల్య పథకానికి సంబంధించి దరఖాస్తుల పరిశీలన కూడా జిల్లా, రాష్ట్ర స్థాయిలోనే జరుగుతుంది. రాష్ట్రంలో 'తల్లిదండ్రులను కోల్పోయినా, తల్లి లేదా తండ్రి లేకున్నా, విడాకులు తీసుకున్న, కుటుంబాన్ని వదిలేసిన తల్లిదండ్రుల పిల్లలు, ప్రాణాంతక వ్యాధులు, ప్రకృతి వైపరీత్యాలకు, అక్రమ రవాణా, దాడులకు గురైన పిల్లలు అర్హులు'గా గుర్తిస్తారు. 18 ఏళ్ల వరకు ప్రతి నెలా రూ.4 వేల చొప్పున ప్రభుత్వం సాయం అందిస్తుంది. ఈ పథకం కింద ఆరు నెలలకు ఒకసారి, మూడు నెలలకు ఒకసారి నిధుల్ని విడుదల చేస్తారు.



● అంగన్వాడీలపై బాధ్యత

రాష్ట్రవ్యాప్తంగా ప్రతి అంగన్‌వాడీ పరిధిలో కార్య కర్తలు మిషన్ వాత్సల్య పథకం గురించి విస్తృతంగా ప్రచారం చేయాల్సి ఉంటుంది. అర్హులైన చిన్నారులను గుర్తించి వారి పేర్లు నమోదు చేయాల్సిన బాధ్య త కూడా వారిపైనే ఉంటుంది. క్రమం తప్పకుండా యాప్ ద్వారా సమాచారాన్ని ఎప్పటికప్పుడు నమోదు చేయాల్సి ఉంటుంది. గుర్తించిన అనాథ పిల్లలు, అర్హులైన చిన్నారుల సంరక్షకులతో మాట్లాడి దర ఖాస్తు చేసు కునేలా అంగన్వాడీ కార్యకర్తలే బాధ్యత తీసుకోవాలి.



హాస్పటల్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

ఇష్టం లేకుంటే.. ఇంటికెళ్లండి

కొల్లిపర పీహెచ్‌సీని తనిఖీ చేసిన మంత్రి మనోహర్

కొల్లిపర, మే 12 (ఆంధ్రజ్యోతి) : సక్రమంగా వైద్యసేవలు ఎందుకు అందించడం లేదు ... మీకు వైద్యం చేయడం మీద ఇంట్రస్ట్ లేకపోతే ఇంటికి వెళ్ళి పోయిండి... హాస్పటల్‌కు వచ్చిన రోగులను ఇబ్బంది పెడితే తగిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వైద్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం కొల్లిపర సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డులను, చిన్నపిల్లల ఓపీని, ఈసీజీ, గర్భిణీ విభాగం సంబంధించిన ఓపీని పరిశీలించారు. రోగులను సరైన సమయంలో వైద్యం అందిస్తున్నారా... మందులు ఇస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. హాస్పటల్ లోని గదులన్నింటికి తాళాలు వేసి ఉండటంతో వైద్య సిబ్బందిపై మండిపడ్డారు. కోట్లాది రూపాయలతో హాస్పటల్‌ను నిర్మాణం చేపడితే మీరు సక్రమంగా వైద్యం ఎందుకు అందించడం లేదని వైద్యులను ప్రశ్నించారు. ప్రభుత్వం కూడా హాస్పటల్‌కు తగిన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నదని అన్నారు. వైద్య సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటున్నారా లేదా అని వైద్యాధికారులను ప్రశ్నించడంతో వారి నుంచి సరైన సమాధానం రాలేదు. హాస్పటల్‌లో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

గుంటూరు (విద్య) మే 12 (ఆంధ్ర జ్యోతి): ఇంటర్ ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి జిల్లా వ్యాప్తంగా అందుకోసం 51 కేంద్రాలు ఏర్పాటు చేశారు ఇంటర్ మొదటి సంవత్సరం 5938 విద్యార్థులు హాజరు కావాల్సిందిగా 5639 మంది హాజరయ్యారు. ద్వితీయ సంవత్సరం పరీక్షకు మొత్తం 452 మంది విద్యార్థులకు 398 మంది విద్యార్థులు హాజరయ్యారని ఇంటర్ బోర్డు ఆర్ఐఓ జుబేర్ వెల్లడించారు. ఎండల నేపథ్యంలో ప్రతి కేంద్రంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మంచినీరు, మెడికల్ కిట్లు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఉదయం ప్రథమ సంవత్సరం విద్యార్థులకు సాయంత్రం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. తొలిరోజు ఎక్కడ కూడా మాల్ ప్రాక్టీస్ కాపీయింగ్ కేసులు నమోదు కాలేదని ఆర్ఐఓ తెలిపారు.



● అశేష జనవాహిని మధ్య సాగుతున్న భావదేవుని రథోత్సవం

భావదేవుని రథోత్సవం..

పోటెత్తిన భక్తజనం

పొన్నూరు టౌన్, మే, 12 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత సాక్షి భావన్నారాయణస్వామి దివ్య రథోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. రథోత్సవానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తజనంతో పొన్నూరు పట్టణం పోటెత్తింది. స్వామివారి కల్యాణోత్సవం ముగింపు సందర్భంగా దివ్య రథోత్సవం నిర్వహించారు. మేజర్ పీటీ చౌదరి వంశస్థులు తొలిపూజలు నిర్వహించి రథోత్సవాన్ని ప్రారంభించారు. సుమారు కిలోమీటరుకు పైగా జీబీసీ రోడ్డు నుంచి పాత పొన్నూరు కసుక్రరు రోడ్డు వరకు ఉత్సవం సాగింది. ఎటువంటి అవాంచనీయ ఘటనలు తలెత్తకుండా డీఎస్పీ జనార్దనరావు ఆధ్వర్యంలో పొన్నూరు అర్బన్, రూరల్, చేబ్రోలు పోలీసులు పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు. ఆలయ ఈవో నల్లకాలువ శ్రీనివాసురెడ్డి, తహసీల్దార్ హక్ పర్యవేక్షించారు.



రథంపై భావదేవుడు


అసంతృప్తి పెరిగిపోతోంది!

- పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో పౌరుల అసంతృప్తి
- 59 శాతం కంటే దిగువకు సంతృప్తిస్థాయి
- ప్రతి అర్జీకి ఒకటే సమాధానం.. ఇందుకు కారణం
- సీఎం, డిప్యూటీ సీఎం, విద్యా శాఖ మంత్రి ఉన్న జిల్లాలోనే ఈ పరిస్థితి
- మొక్కుబడి కార్యక్రమంగా భావిస్తున్న జిల్లా స్థాయి అధికారులు

గుంటూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): పబ్లిక్ గ్రీవియన్స్ రీడ్రెసల్ సిస్టమ్(పీజీఆర్ఎస్)కు అందుతున్న అర్జీల పరిష్కారంలో పౌరుల నుంచి సంతృప్తి స్థాయి తగ్గిపోతోంది. రోజురోజుకు సంతృప్తి వ్యక్తం చేసే వారి సంఖ్య తగ్గిపోతుండడం గుంటూరు జిల్లాలో ఆందోళన కలిగిస్తోంది. ఇందుకు ప్రధాన కారణం జిల్లా స్థాయి అధికారులు పీజీఆర్ఎస్‌కు అంత ప్రాధాన్యం ఇవ్వకపోవడమే. ద్వితీయ, తృతీయ శ్రేణి అధికారులు పీజీఆర్ఎస్‌కు వస్తున్నారు. వాళ్లకు సమస్యని పరిష్కరించే స్థాయి/సామర్థ్యం ఏమాత్రం లేదన్న విషయం బహిరంగ రహస్యమే. కనీసం ఉన్నతాధికారులకైనా నివేదించి గడువు తేదీ లోపు సమస్యని పరిష్కరిస్తున్నారా అంటే అదీ లేదు. పీజీఆర్ఎస్ ముగియగానే ఎవరికి వారు వెళ్లిపోతుంటారు. మళ్లీ సోమవారం వచ్చినా.. ఆ సమస్య పరిష్కారం ఏమైందో తెలియని పరిస్థితి.

అర్జీలు తీసుకోవడమే.. పరిష్కారం లేదు..

కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు ఏదైనా కార్యక్రమాల్లో బిజీగా ఉంటే కలెక్టర్, జేసీ హాజరు కావడం లేదు. దీంతో డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారులు పీజీఆర్ఎస్‌ని నిర్వహిస్తున్నారు. వీళ్లకి జిల్లా స్థాయి అధికారులపై ఎలాంటి కమాండ్ ఉండదు. కనీసం తహసీల్దార్లకు కూడా చెప్పి సమస్యని పరిష్కరించలేరు. అర్జీదారుడు వస్తే సంబంధిత శాఖ నుంచి హాజరైన దిగువ శ్రేణి అధికారి వచ్చి అర్జీ తీసుకొని, పంపించేస్తారు. ఇంజనీరింగ్ డిపార్టుమెంట్ల



నుంచి ఎస్ఈ/ఈఈలు ఎప్పటికో వస్తుంటారు. ఎక్కువగా డీఈఈ/ఏఈఈలే హాజరవుతారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖలోనూ ఇదే తంతు. మైనింగ్ డిపార్టుమెంట్‌లో అయితే జిల్లాస్థాయి అధికారికి బదులుగా చాలా కిందిస్థాయి సిబ్బంది హాజరవుతారు. పోలీసు శాఖ నుంచి సీఐ, నగరపాలక సంస్థ నుంచి డిప్యూటీ కమిషనర్ వస్తారు. దీంతో వీళ్లకి ఆ సమస్యపై సరైన అవగాహన కూడా ఉండదు.

1,043 పెండింగ్ అర్జీలు..

తాజాగా అధికారి వారీగా ఎస్ఎల్ఏ రిపోర్టుని కలెక్టరేట్ అధికారులు సంబంధిత అధికారులకు పంపించారు. 1,043 పెండింగ్ అర్జీలు ఉండగా వాటిల్లో పొన్నూరు తహసీల్దారు 31, గుంటూరు కలెక్టరేట్ 254, గుంటూరు ఆర్డీఓ 58, మంగళగిరి తహసీల్దార్ 41, సర్వేయర్ తెనాలి 9, గుంటూరు తూర్పు తహసీల్దార్ 41, గుంటూరు వెస్టు తహసీల్దారు 43, పెదకాకాని తహసీల్దారు 42, మేడికొండూరు తహసీల్దారు 37, తెనాలి ఆర్డీఓ 36, తుళ్లూరు తహసీల్దారు 29, సర్వేయరు పెదనందిపాడు 26, ఫిరంగిపురం తహసీల్దారు 26, నగరంపాలెం ఎస్‌హెచ్‌వో 25, ప్రత్తిపాడు తహసీల్దారు 22, ప్రత్తిపాడు సర్వేయర్ 21 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ కారణంగా నెల రెండు వారాల క్రితం అర్జీల పరిష్కారంలో జిల్లాలో సంతృప్త స్థాయి 59 శాతం ఉండగా ఇప్పుడు మరింత దిగువకు పడిపోయింది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఉన్న ఈ జిల్లాలో సంతృప్తిస్థాయి సరిగా లేకపోవడంపై ఉన్నతాధికారులు జిల్లా యంత్రాంగంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సీఎంవో నుంచి అర్జీల పరిష్కారంపై ఆన్‌లైన్‌లో ట్రైనింగ్ క్లాస్‌లు నిర్వహిస్తున్నప్పటికి ఎలాంటి మార్పు రావడం లేదు.

ఏషియన్ కప్‌లో మహిళా లిఫ్టర్లకు పతకాలు

మంగళగిరి సిటీ, మే 12 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో జరుగుతున్న ఏషియన్ యూనివర్సిటీ కప్ పోటీల్లో గుంటూరు జిల్లాకు చెందిన మహిళా లిఫ్టర్లు అద్భుత ప్రతిభ కనబర్చి పలు పతకాలను సొంతం చేసుకున్నారని జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయభాస్కరరావు, షేక్ సందాని సోమవారం తెలియజేశారు. 47 కిలోల విభాగంలో మదిర షానూన్, 84 కిలోల విభాగంలో షేక్ షబీనా, 84 కిలోలు పైబడిన విభాగంలో నాగం జ్ఞానదివ్యలు స్క్వాట్, బెంచిప్రెస్, డెడ్‌లిఫ్ట్‌లో బంగారు పతకాలతోపాటు ఓవరాల్‌గా బంగారు పతకాలను సొంతం చేసుకున్నారని వెల్లడించారు. ఏషియన్ యూనివర్సిటీ కప్ ఎక్విప్డ్ అండ్ క్లాసిక్ ఉమెన్ పవర్ లిఫ్టింగ్‌లో కేఎల్ యూనివర్సిటీ జట్టు చాంపియన్‌షిప్, క్లాసిక్‌లో ద్వితీయ స్థానం, ఎక్విప్డ్‌లో తృతీయ స్థానం సాధించారని పేర్కొన్నారు. పతకాలు సాధించిన లిఫ్టర్లను కేఎల్‌యూ యాజమాన్యం, ఫిజికల్ ఎడ్యుకేషన్ డీన్ కాకర్ల హరికిషోర్, జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ వైస్‌చైర్మన్ ఆర్ఎస్ వంశీకృష్ణ, సౌత్ ఇండియా ఆర్గనైజింగ్ సెక్రెటరీ సకల కోటేశ్వరరావు, ఏపీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంటా వెంకటేశ్వరరావు, సకల సూర్యనారాయణ తదితరులు అభినందించారు.



పతకాలు సాధించిన మహిళా లిఫ్టర్లతో సంధాని, కోటేశ్వరరావు

ఏపీ ఎడ్‌సెట్ దరఖాస్తు గడువు రేపటితో ఆఖరు

◆ అపరాధ రుసుంతో జూన్ 3 వరకు అవకాశం

పెదకాకాని, మే 12 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎడ్‌సెట్ -2025 దరఖాస్తుకు ఈ నెల 14న బుధవారంతో గడువు ముగుస్తుందని ఏపీ ఎడ్‌సెట్ రాష్ట్ర కన్వీనర్ ఆచార్య ఏవీవీఎస్ స్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.1000 అపరాధ రుసుంతో ఈ నెల 19, రూ.2వేలతో 24వ తేదీ వరకు, రూ.4వేలతో 26వ తేదీ వరకు, రూ.10 వేల అపరాధ రుసుంతో మే 27 నుండి జూన్ 3 తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. మే 30 నుండి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. జూన్ 5న మధ్యాహ్నం 2 నుండి 4 గంటల వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందని తెలిపారు.

16 నుంచి ఆహ్వాన నాటిక పోటీలు

చిలకలూరిపేట, మే12 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట సీఆర్ క్లబ్, కళాపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 16, 17, 18 తేదీల్లో తెలుగు రాష్ట్రాల స్థాయిలో 9వ ఆహ్వాన నాటిక పోటీలు స్థానిక సీఆర్ క్లబ్ ఓపెన్ థియేటర్‌లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలి రోజు నాటిక పోటీలను స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభిస్తారన్నారు. హైదరాబాద్ కళాంజలి వారి రైతే రాజు, చిలకలూరిపేట మద్దుకూరి ఆర్ట్ క్రియేషన్ వారి మా ఇంట్లో మహాభారతం, హైదరాబాద్ యువభేరి థియేటర్స్ వారి నా శత్రువు నాటికల ప్రదర్శన జరుగుతుందన్నారు. 17న హైదరాబాద్ మిత్ర క్రియేషన్స్ వారి ఇది రహదారి కాదు, కరీంనగర్ కళాభారతి వారి చీకటిపువ్వు, విశాఖపట్నం భద్రం ఫౌండేషన్ వారి దొందు దొందే, 18న గుంటూరు అమరావతి ఆర్ట్స్ వారి చిరుగు మేఘం, చిలకలూరిపేట అమెచ్యూర్ డ్రమెటిక్ అసోసియేషన్ వారి ఆలితో సరదాగా, గుంటూరు అమృతలహరి థియేటర్ ఆర్ట్స్ వారి నాన్నా నేనొచ్చేస్తా నాటికల ప్రదర్శన ఉంటుందన్నారు.


ప్రత్యేక అలంకరణలో శ్రీ లక్ష్మీనృసింహస్వామి


నృసింహుని జయంత్యుత్సవాల్లో పాల్గొన్న ఈవో రామకోటిరెడ్డి, అర్చకులు

ముగిసిన నృసింహుడి జయంతి ఉత్సవాలు

మంగళగిరి సిటీ, మే 12 (ఆంధ్రజ్యోతి): మంగళాద్రి శ్రీలక్ష్మీనృసింహ స్వామి దేవస్థానంలో ఈ నెల 7వ తేదీ నుంచి జరుగుతున్న నృసింహుని జయంతి (ఆవిర్భావ) ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. చివరి రోజు ఉదయం నర సింహ మూల మంత్ర హోమం, మహాపూర్ణాహుతి, శాంతి కల్యాణం, సాయంత్రం రాజాధిరాజ వాహనంపై స్వామివార్ల గ్రామోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవానికి స్వర్గీయ మాల్యవంతం లక్ష్మీనరసింహాచార్యులు, శేషమ్మ కుటుంబసభ్యులు శాశ్వత కైంకర్యపరులుగా వ్యవహరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. దేవదాయ శాఖ సహాయ కమిషనర్, ఆలయ ఈవో అన్నపురెడ్డి రామకోటిరెడ్డి, ప్రధాన అర్చకుడు మాల్యవంతం శ్రీనివాస దీక్షితులు, అర్చక బృందం పాల్గొన్నారు.

పేదలను ఆదుకోవడమే కూటమి లక్ష్యం

● రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్


మంత్రి నాదెండ్ల మనోహర్‌కు తమ సమస్యలు తెలుపుతున్న వృద్ధులు

కొల్లిపర, మే 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేద ప్రజలు దయనీయ పరిస్థితిలో ఉన్నారని, వారిని ఆదుకోవడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. సోమవారం మండల కేంద్రం కొల్లిపర జనార్దనస్వామి ఆలయ సమీపంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రసంగించారు. కార్యక్రమానికి తహసీల్దార్ సిద్ధార్థ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందన్నారు. ప్రతి నెలా 9,600 మందికి రూ.40 కోట్లు పెన్షన్ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రీవెన్స్‌కు సుమారు 500పైగా దరఖాస్తులు వచ్చినట్లు వెల్లడించారు. ప్రతి దరఖాస్తును వారంలో పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఎక్కువగా రేషన్ కార్డులు కోసం అర్జీలు వచ్చాయని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో 1.46 కోట్ల మందికి నూతనంగా రేషన్ కార్డులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు ఆయన చెప్పారు. సర్పంచ్ పిల్లి రాధిక, ఎంపీపీ భీమవరపు పద్మావతి, ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ్‌తేజ, సబ్ కలెక్టర్ సంజనాసిన్హా, ఎంపీడీవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని అస్థిరపరిచే విధానాలకు స్వస్తిచెప్పాలి

● యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షురాలు ఏఎన్ కుసుమకుమారి



ఆర్డీవో శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

గుంటూరు(విద్య),మే 12(ఆంధ్రజ్యోతి): విద్యా రంగాన్ని అస్థిరపరిచే విధానాలకు స్వస్తి చెప్పాలని, లేకుంటే తీవ్ర ఆందోళన చేస్తామని యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షురాలు ఏఎన్ కుసుమకుమారి స్పష్టం చేశారు. బదిలీలు, ఉద్యోగోన్నతులు పారదర్శకంగా నిర్వహించాలని, పాఠశాలల పునర్విభజన సక్రమంగా చేపట్టాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. కుసుమకుమారి పాల్గొని, మాట్లాడుతూ గత, ప్రస్తుత ప్రభుత్వాలు రకరకాల పేర్లతో హడావుడిగా తీసుకు వచ్చిన +2 విధానం, 3, 4, 5 తరగతుల తరలింపు వల్ల అనేక సమస్యలు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. యూపీ పాఠశాలలపై అనుసరిస్తున్న వైఖరి, ఉన్నత పాఠశాలల పట్ల అనుసరిస్తున్న విధానాలు గందరగోళానికి గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. ఇటువంటి చర్యల వల్ల తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రైవేటు బాట పట్టిస్తున్నారని తెలిపారు. యుటీఎఫ్ ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ జీవో నంబరు 117 వల్ల ప్రభుత్వం విద్యా రంగానికి తీవ్ర నష్టం కలిగించిందని విమర్శించారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్ రావు, ఎం.కళాధర్ మాట్లాడుతూ పాఠశాలల్లో ఉపాధ్యాయుడు పిల్లల నిష్పత్తి తగ్గించాలని డిమాండ్ చేశారు. బదిలీల ప్రమోషన్ల కౌన్సెలింగ్ మాన్యువల్‌గా నిర్వహించాలని కోరారు. ప్రభుత్వం స్పందించకుంటే ఈ నెల 15న పాఠశాల కమిషనర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం ఉంటుందని హెచ్చరించారు. కలెక్టర్, డీఈఓ కార్యాలయంలో వినతి పత్రాలు అందజేశారు. యూటీఎఫ్ జిల్లా కోశాధికారి ఎండి దౌలా, కార్యదర్శులు పాల్గొన్నారు.

కలెక్టర్ విధుల పర్యవేక్షణకు.. జేసీకి ఉత్తర్వులు

గుంటూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి వచ్చే నెల ఆరో తేదీ వరకు మిడ్ టర్మ్ కెరీర్ ట్రైనింగ్‌కు ముస్సోరిలోని ఐఏఎస్ అకాడమికి వెళ్లడంతో ఆమె విధులను పర్యవేక్షించాలని ప్రభుత్వం జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ తేజకు ఆదేశాలు జారీ చేసింది. గతంలో కలెక్టర్ సెలవుపై వెళితే ఇన్‌చార్జిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యేవి. ఎక్కువ రోజులు సెలవు పెడితే పూర్తి అదనపు బాధ్యతలు(ఎఫ్ఏసీ) ఇస్తూ జీవో విడుదల చేసేది. ఇటీవల కలెక్టర్ నాగలక్ష్మి విదేశీ పర్యటనకు వెళ్లినప్పుడు కూడా ఇన్‌చార్జిగా జేసీని నియమించింది. ఇప్పుడు ఇన్‌చార్జి/ఎఫ్ఏసీ కాకుండా కలెక్టర్ విధులను పర్యవేక్షించాలని ఉత్తర్వులు జారీ చేయడం రెవెన్యూలో చర్చనీయాంశంగా మారింది. ఇంచుమించుగా నెల పాటు శిక్షణ నిమిత్తం కలెక్టర్ వెళ్లారంటే ఖచ్చితంగా ఎఫ్ఏసీ ఉండాల్సిందే. లేకుంటే పరిపాలన పరంగా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం ఏమి ఆలోచన చేసిందో ఏమో 'లుక్ ఆఫ్టర్ కలెక్టర్ డ్యూటీస్' అని మాత్రమే ఇచ్చినట్లు రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. దీనిపై పూర్తిస్థాయిలో స్పష్టత రెండు, మూడు రోజుల్లో వచ్చే అవకాశం ఉన్నది.

కొన్ని నెలల నుంచి గుంటూరు జిల్లాకు కలెక్టర్‌గా పోస్టింగ్ కోసం పలువురు ఐఏఎస్ అధికారులు ప్రభుత్వస్థాయిలో ప్రయత్నాలు చేసుకొంటున్నట్లు సమాచారం. గతంలో పల్నాడు కలెక్టర్‌గా విధులు నిర్వహించి, కోర్టు ఆదేశాలతో తెలంగాణ క్యాడర్‌కు వెళ్లి మళ్లీ క్యాట్ ఉత్తర్వులతో ఆంధ్రప్రదేశ్ సర్వీసుకు వచ్చిన లోతేటి శివశంకర్ గుంటూరు కలెక్టర్‌గా పోస్టింగ్ కోసం ప్రయత్నిస్తున్నట్లు రెవెన్యూ వర్గాలు చర్చించుకొంటున్నాయి. 2014-19 మధ్యన గుంటూరు జేసీగా, ఏపీసీఆర్‌డీఏ కమిషనర్‌గా విధులు నిర్వహించిన చెరుకూరి శ్రీధర్ పేరు కూడా గుంటూరు కలెక్టర్ పోస్టింగ్ కోసం వినిపిస్తోంది. గతంలో జేసీగా విధులు నిర్వహించి ఇప్పుడు మానవ వనరుల శాఖలో బాధ్యతలు నిర్వహిస్తున్న కృతిక శుక్లా పేరు కూడా ప్రస్తావనకు వస్తోంది. కలెక్టర్ నాగలక్ష్మిని బదిలీ చేస్తారానన్న చర్చ కూడా కొనసాగుతోంది.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

గుంటూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని దేవాపురం రెండో లైనుకు చెందిన అంతర్రాష్ట్ర దొంగ పులి రమేష్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ద్విచక్ర వాహన చోరీలకు పాల్పడుతున్నట్లు అందిన సమాచారం మేరకు పట్టాభిపురం ఎస్సై సుబ్బారావు, సిబ్బంది సోమవారం ఇంటిలో రమేష్‌ను అదుపులోకి తీసుకుని రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. రమేష్‌పై రాష్ట్రవ్యాప్తంగా 50కు పైగా దొంగతనాల కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు. పట్టాభి పురం పోలీస్‌స్టేషన్‌లో సస్పెక్ట్ షీట్ ఉండగా, నగరంపాలెం పోలీస్‌స్టేషన్లో రౌడీషీట్ ఉందన్నారు.

ఉర్దూ డీఐ పోస్టులు వెంటనే భర్తీ చేయాలి

గుంటూరు(విద్య),మే 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చిత్తూరు, కర్నూలు, అనంతపురం, కడప, కృష్ణ, గుంటూరు, బాపట్ల, విశాఖపట్నం, తూర్పుపశ్చిమ గోదావరి, నెల్లూరు, ప్రకాశం జిల్లాల ఉర్దూ డీఐ (డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ ఉర్దూ రేంజ్) పోస్టులు అర్హులైన వారితో భర్తీ చేయాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ ఇక్బాల్, సయ్యద్ ముష్తాఖ్ కోరారు. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి విజయరామరాజుకు సోమవారం సచివాలయంలో సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఉర్దూ పాఠశాలల పర్యవేక్షణకు, విద్యార్థుల విద్యాభివృద్ధికి, ఉర్దూ ఉపాధ్యాయులకు మార్గదర్శకులుగా ఉర్దూ డీఐలు ఎంతో దోహదపడతారని, పోస్టులు ఖాళీగా ఉన్నందున దశాబ్ద కాలంగా ఉర్దూ పాఠశాలలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎంతో నష్టపోయారని తెలిపారు. ఉర్దూ డీఐ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

సీఆర్డీఏ అధికారుల తీరుపై ఆగ్రహం

తుళ్లూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): 'చిరు వ్యాపారుల పైనా మీ ప్రతాపం..' అంటూ టీడీపీ నాయకులు, రైతులు సీఆర్డీఏ అధికారులపై సోమవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. తుళ్లూరు అయ్యప్ప స్వామి ఆలయం ఎదురు ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన మూడు కుటుంబాలు బడ్డీ కొట్లు పెట్టుకొని జీవనం సాగిస్తున్నాయి. ఆలయం స్థలంలో చిరు వ్యాపారులను ఖాళీ చేయించాలని అధికారులకు ఆలయ కమిటీ సభ్యులు ఫిర్యాదు చేశారు. అయితే వారు ఆర్‌అండబీ స్థలంలోనే ఉన్నారని ఇబ్బంది పెట్టొద్దంటూ టీడీపీ నాయకులు అధికారులకు సూచించారు. కానీ, అధికారులు ససేమిర అనడంతో.. తుళ్లూరు సీఆర్డీఏ ఆఫీసుకు రైతులు, టీడీపీ నాయకులు వెళ్లారు. తహసీల్దార్ రవిబాబుని కలసి రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు ధనేకుల సుబ్బారావు, రాష్ట్ర నాయకుడు దామినేని శ్రీనివాసరావు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు కాటా అప్పారావు, రైతులు ఉన్నారు.

మన్నెయ్యకు 14 రోజుల రిమాండ్

● టీడీపీ కార్యాలయం దహనం కేసులో నిందితుడు

మాచర్లటౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్ ఊరిబండి మన్నెయ్యను మాచర్ల పోలీసులు సోమవారం పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరిచారు. 2022 డిసెంబరు 16న పట్టణంలోని టీడీపీ కార్యాలయం దహనం కేసులో మన్నెయ్య ఏ-27 నిందితుడు. న్యాయాధికారి పి.ప్రశాంత్ నిందితుడికి 14 రోజులు రిమాండ్ విధించారు. ఇప్పటికే పలు కేసుల్లో మన్నెయ్య రాజమండ్రి సెంట్రల్ జైల్‌లో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. రిమాండ్ అనంతరం మాచర్ల పట్టణ ఎస్ఐ తురకా వెంకటరమణ మన్నెయ్యను రాజమండ్రి సెంట్రల్ జైల్‌కు తరలించారు.

వైసీపీ నాయకుడి బెదిరింపులపై ఎస్పీకి ఫిర్యాదు

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), మే,12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ సానుభూతిపరుడు నుంచి ఎదురైన బెదిరింపులపై సోమవారం జిల్లా ఎస్పీకి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో చేబ్రోలు పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. పంచాయతీ పరిధిలో కూరగాయల మార్కెట్ ఆశీలు వేలం పాట 2024-25కు చేబ్రోలుకు చెందిన వైసీపీ సానుభూతిపరుడు వేపూరి బసవపున్నయ్య రు.9 లక్షలకు దక్కించుకున్నాడు. అయితే అతను పంచాయతీకి నగదు జమ చేయకుండానే ఆశీలు వసూలుకు పాల్పడ్డాడు. పంచాయతీకి వేలంపాట నగదు చెల్లించాలని కార్యదర్శి శ్రీనివాసరావు పలుమార్లు బసవపున్నయ్యను కోరగా డబ్బులు చెల్లించనని, అవసరమైతే బదిలీ చేయిస్తానని హెచ్చరించారని ఫిర్యాదు పేర్కొన్నారు. మరోసారి నగదు చెల్లించాలని కోరితే అంతు చూస్తానని బెదిరించినట్లు కార్యదర్శి శ్రీనివాసరావు జిల్లా ఎస్పీకి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు అందజేశారు.

19 నుంచి పది సప్లిమెంటరీ హాల్ టికెట్లు

గుంటూరు (విద్య)మే 12 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 19 నుండి 28వ తేదీ వరకు నిర్వహించే పదవ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల హాల్ టికెట్లు వెబ్‌సైట్, వాట్సాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవవచ్చని డీఈవో సీవీ రేణుక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మన మిత్ర వాట్సాప్ నంబరు 95523 00009 ద్వారా పాఠశాల, విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, జిల్లా నమోదు చేసి, లేదా బీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.

డైట్ సెట్ దరఖాస్తు గడువు పొడిగింపు

గుంటూరు (విద్య) మే 12 (ఆంధ్రజ్యోతి): డైట్ సెట్ దరఖాస్తుకు ఈ నెల 20వ తేదీ వరకు అవకాశం కల్పించినట్లు డీఈఓ సీవీ రేణుక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

నేడు ఎంపీడీవోలతో జడ్పీ సీఈవో సమీక్ష

గుంటూరు సిటీ, మే 12(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఎంపీడీవోలతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో జ్యోతి బసు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో కార్యాలయాల ఏవోలు కూడా పాల్గొనాలని అందులో పేర్కొన్నారు.

కర్ణాటకలో రోడ్డు ప్రమాదం

● ముగ్గురు గుంటూరు జిల్లా వాసుల దుర్మరణం

బెంగళూరు, మే 12(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ నుంచి హొళల్కెరె వైపు వెళ్తున్న ఇన్నోవా కారును సోమవారం తెల్లవారుజామున ఎదురుగా వచ్చిన లారీ ఢీ కొట్టడంతో గుంటూరు జిల్లా వెంకటాపురానికి చెందిన ముగ్గురు దుర్మరణం చెందారు. సునీత (34), శ్యాంబాబు (17), శివనాగలి (55) మృతి చెందిన వారిలో ఉన్నారు. వీరు గుంటూరు నుంచి శివమొగ్గకు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయింది. ప్రమాదంపై హొళల్కెరె పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	125, 134, 145
చికెన్ విత్ స్కిన్(కిలో)	236.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	246.00



గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



ప్రసంగిస్తున్న మేయర్ కోవెలమూడి రవీంద్ర, పక్కన కమిషనర్ తదితరులు

సమగ్రంగా తాగునీటిని అందించేందుకు ప్రత్యేక దృష్టి

● నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర

గుంటూరు కార్పొరేషన్, మే 12 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో ప్రతి ప్రాంతానికి సమగ్రంగా తాగునీటిని అందించేందుకు ప్రత్యేక దృష్టి సారించామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. సోమవారం గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో అమృత్ 2.0లో భాగంగా సమగ్ర తాగునీటి పథకం అమలుకు రూపొందించిన డీపీఆర్‌పై సలహాలు, సూచనలు కోసం నగరంలోని స్టేక్ హోల్డర్స్, సీనియర్ సిటిజన్స్, ప్రజా ప్రతినిధులతో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు నిర్వహించిన సమావేశంలో మేయర్ పాల్గొన్నారు.

మేయర్ మాట్లాడుతూ నగరంలో 2014 నుంచి 24/7 తాగునీరు అందిస్తామని జీఎంసీ ప్రకటిస్తున్నా ఆచరణలో సాధ్యం కాలేదన్నారు. ఇప్పటికీ పలు ప్రాంతాల్లో నీటి ఎద్దడి ఉందని, రానున్న కాలంలో ప్రతి ప్రాంతానికి నీటిని పుష్కలంగా అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. గోరంట్ల కొండ మీద నిర్మాణంలో ఉన్న రిజర్వాయర్ పనుల పురోగతిపై కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ప్రతివారం పురోగతిపై నివేదిక అడిగారన్నారు. కనుక జీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు యుద్ధప్రాతిపదికన గోరంట్ల ప్రాజెక్టు పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. కమిషనర్ మాట్లాడుతూ అమృత్ 2.0ని రానున్న 30 ఏళ్ల వరకు ప్రజలకు తాగునీటి అవసరాలను అంచనా వేసి అమృత్, యూఐడీఎఫ్ నిధుల ద్వారా సుమారు రూ.540 కోట్ల అంచనాలతో డీపీఆర్ రూపొందించామని, పనులను 2 ఏళ్ల కాల పరిమితితో పూర్తి చేయడానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకున్నామన్నారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే నగర ప్రజలకు తాగునీటి సమస్య ఉండదన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, డిప్యూటీ మేయర్ షేక్ సజిలా, ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ డి.శ్రీనివాస్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

శ్రీనివాస్ యాదవ్ మరిన్ని పదవులు అధిరోహించాలి

● మేయర్ కోవెలమూడి రవీంద్ర

గుంటూరు కార్పొరేషన్, మే 12 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ యాదవ్ భవిష్యత్తులో మరిన్ని పదవులు అధిరోహించాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. సోమవారం టీడీపీ నాయకులు పొదిలి వాసు, బెజవాడ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్మల్ హృదయ్‌లో ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేసి వృద్ధులకు, అనాథలకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్పొరేటర్లు ఈరంటి వరప్రసాద్, షేక్ మీరాలి, పార్టీ నాయకులు కసుకుర్తి హనుమంతరావు, వి.మరియదాసు, మాచర్ల దాసు, నక్కా దాసు, రసూల్, బాజీ, ఆనంద్ పాల్గొన్నారు.

మురళీనాయక్‌కు కోవెలమూడి రవీంద్ర నివాళి



మురళీనాయక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మేయర్ కోవెలమూడి రవీంద్ర తదితరులు

గుంటూరు కార్పొరేషన్, మే 12 (ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్ సరిహద్దులో ఎల్‌వోసీ (లైన్ ఆఫ్ కంట్రోల్) వద్ద పాకిస్థాన్ కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన ఆర్మీ జవాన్ మురళీనాయక్ చిత్రపటానికి నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజీల, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, నగరపాలక సంస్థ వివిధ విభాగాల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా కోర్టు ప్రాంగణంలో..

గుంటూరు(విద్య) మే 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టు ప్రాంగణంలో సోమవారం జవాన్ మురళినాయక్‌కు న్యాయవాదులు ఘన నివాళులర్పించారు. అనంతరం మజ్జిగ చలివేంద్రం కేంద్రాన్ని భారతీయత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా భారతీయత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు చిగురుపాటి రవీంద్రబాబు మాట్లాడుతూ బాల్యం నుంచే సైన్యంలో చేరాలని మురళినాయక్ దృఢ సంకల్పంతో ఉన్నారని, సైన్యంలో చేరి వీరమరణం పొందారని అన్నారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు

ఘనంగా శిఖర గోపుర, కలశ స్థాపన ప్రారంభం



అరండల్‌పేట శివాలయంలో జరిగిన పూజలో కుటుంబంతో కలసి పాల్గొన్న శ్రీధర్ శర్మ

గుంటూరు, మే 12 (ఆంధ్రజ్యోతి) : అరండల్‌పేట 4/4లోని శివాలయంలో సుబ్రహ్మణ్య స్వామి, అయ్యప్ప స్వామి ఆలయ శిఖర గోపుర, కలశ స్థాపన త్రయాహ్నిక మహోత్సవం ఘనంగా ప్రారంభమైంది. సోమవారం గణపతి పూజలు, దీక్ష దారణ, వాస్తు హోమం కార్యక్రమాలను నిర్వహించారు. యాగబ్రహ్మ కాశీ విశ్వనాథశర్మ పర్యవేక్షణలో ఆయా కార్యక్రమాలు జరిగాయి. కాగా బుధవారం హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధీశ్వరులు విద్యారణ్య భారతి ఆధ్వర్యంలో ప్రతిష్ఠ మహోత్సవం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఏకా ప్రసాదు, అర్చకులు కుందుర్తి సుబ్రహ్మణ్యశర్మ, కుందుర్తి భాస్కరశర్మ, ఆలయ గోపుర నిర్మాణ, శిఖరాల దాత సిరిపురపు శ్రీధర్‌శర్మ, దారపనేని శివప్రసాదు, మర్రిపాటు ప్రసాదు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భక్తి రంజని

గుంటూరు(తూర్పు), మే 12(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై స్వరరాగ సుధ ఆధ్వర్యంలో అన్నమయ్య జయంతి సందర్భంగా సోమవారం జరిగిన భక్తి సంగీత విభావరి ప్రేక్షకులను ఆకట్టుకుంది. తొలుత ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య సహాయ కార్యదర్శి ఊటుకూరు నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గాయని, గాయకులు కేవీ సాయిబాబా శర్మ, నాగమల్లేశ్వరరావు, కృష్ణకుమారిలు తమ గాత్రధారణలో అన్నమాచార్య విరచిత పలు భక్తి గీతాలు శ్రావ్యంగా ఆలపించారు. కీబోర్డుపై ఎం రామకృష్ణ శర్మ, తబలాపై షణ్ముఖశర్మ వాయిద్య సహకారం అందించారు. ఆలయ కమిటీ సభ్యులు కళాకారులను ఘనంగా సత్కరించారు.

బుద్ధుడి జీవితం విశ్వానికి వెలుగు

గుంటూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): భారతీయ తత్వవేత్త, సంస్కర్త అయిన బుద్ధుడి జీవితం విశ్వానికి వెలుగైందని, ఎందరికో ఆత్మోద్ధరణకి దారి చూపించిందని అందుకే వైశాఖ పూర్ణిమను బుద్ధ పూర్ణిమ అంటారని విశ్లేషకులు ఎన్.సదాశివం పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సోమవారం బుద్ధ జయంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుద్ధుడి బోధనలు ఇప్పటికీ అనుసరణీయమేనని పేర్కొన్నారు. బుద్ధుడు అసామాన్యుడిగా జన్మించి, సామాన్యుడిగా జీవనయాత్ర గడిపాడని, సర్వభోగాలను తృణప్రాయంగా విడిచిపెట్టి ఆధ్యాత్మిక యాత్ర చేసి అనుకున్నది సాధించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, ప్రసాద్, సుబ్బారెడ్డి, జనార్ధనరావు, మురళీ కృష్ణ తదితరులున్నారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు

● స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంగరాజు
● ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 199 అర్జీలు
● పరిష్కరించాలంటూ ఆదేశాలు



అర్జీదారులతో మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, ఆర్డీవో శ్రీనివాసరావు తదితరులు

గుంటూరు(తూర్పు), మే 12(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంగరాజు స్పష్టం చేశారు. సోమవారం, కలక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 199 అర్జీలు వచ్చాయి. కలెక్టర్, జేసీ అందుబాటులో లేకపోవడంతో ఆర్డీవో కే శ్రీనివాసరావు, జడ్పీ సీఈవో జ్యోతిబసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారితో కలసి ఆయన అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో డీటీసీ సీతారామిరెడ్డి, వ్యవసాయ జేడీ వెంకటేశ్వర్లు, సీపీవో శేషశ్రీ, ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రావణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

● ఉపాధి హామీ శ్రామికులకు రావాల్సిన కూలీని తక్షణమే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు కోరారు. కలెక్టరేట్, పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందజేశారు. గత ఏడాది జనవరి నుంచి జిల్లాలో దాదాపు రూ.10 కోట్లు బకాయిలు ఉన్నాయని, ఈ నిధులు విడుదల చేయకపోవడంతో శ్రామికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో షేక్ గౌస్, ప్రభుదాసు, గుర్రంకొండ సత్యానందం తదితరులున్నారు.

● ఐదు నెలల పెండింగ్ జీతాలు, బిల్లులు చెల్లించాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్(సీఐటీయూ)ఆధ్వర్యంలో అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు రమణమ్మ మాట్లాడుతూ డిసెంబర్ నుంచి వేతనాలు లేక వంట బిల్లులు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. మెనూ చార్జీలు పెంచుతున్నట్టు ప్రకటన ఇచ్చినప్పటికీ ఇంతవరకు అమలు చేయలేదన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో దండా లక్ష్మీనారాయణ, ముక్తేశ్వరమ్మ, లక్ష్మీ తదితరులు ఉన్నారు.

● సబ్సిడీ రుణాల కోసం బీసీ కార్పొరేషన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారి సమాచారాన్ని ఇతరులకు ఇచ్చి వారు చెప్పిన వారిని మాత్రమే బ్యాంకుల ఆన్‌లైన్‌లో పంపుతున్న నగరపాలక సంస్థ, ఉపా సెల్ అధికారులపై చర్యలు తీసుకోవాలని రజకవృత్తి దోబీఘాట్ల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు చెన్నూరి చెన్నయ్య అర్జీ అందజేశారు.

● స్థానిక ఎత్తురోడ్డులోని మస్తాన్‌బాబా దర్గా స్వాధీనంలో అలసత్వం వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ముస్లిం సేన రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సుభానీ, ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నాగుల్ మీరా అర్జీ అందజేశారు. దర్గా ముతవల్లి రావి రామ్మోహనరావును సస్పెండ్ చేసి, డైరెక్టు మేనేజ్‌మెంట్‌లోకి తీసుకోవాలని రెండు నెలల క్రితమే ఉత్తర్వులు వచ్చినప్పటికి అధికారులు స్పందించడం లేదన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులపై కాలయాపన చేస్తున్న అధికారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు.

● నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు, ఇతర సమస్యలపై ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సహకరించాలని కోరుతూ కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అర్జీ అందజేశారు. సమ్మెలో దాదాపు పది కార్మిక సంఘాలతో పాటు వందలాది ఉద్యోగ సంఘాలు పాల్గొంటాయని వివరించారు. సమ్మె సన్నద్ధంలో భాగంగా 12, 13వ తేదీల్లో వాణిజ్య, వర్తక సంఘాలకు, అధికారులకు సమ్మె నోటీసులు అందిస్తూ సహకారం ఇవ్వాలని కోరుతూ ఈ కార్యక్రమాన్ని చేపట్టామని పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో దండా లక్ష్మీనారాయణ, పుప్పాల సత్యనారాయణ, మేడా హనుమంతురావు తదితరులు ఉన్నారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ జీతాలు విడుదల చేయాలి



నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్

గుంటూరు సిటీ, మే 12(ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ జీతాలు వెంటనే విడుదల చేయాలని ఏపీ ఎంసీఏ జిల్లా అధ్యక్షురాలు టీ ప్రవళిక డిమాండ్ చేశారు. గుంటూరు కలెక్టర్ కార్యాలయం ఎదుట కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాలు 15 రోజులకు చేరాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రవళిక మాట్లాడుతూ ప్రభుత్వం ప్రోత్సాహకాలు విడుదల చేసినట్లు జీవో ఇచ్చినా ఇంత వరకు ఖాతాల్లో జమ చేయలేదని అన్నారు. గత నెల జీతాలు కూడా పెండింగ్‌లో పెట్టారని పేర్కొన్నారు. నేషనల్ హెల్త్ మిషన్‌కు చెందిన తమకు 23 శాతం జీతాలు పెంచాలని, అద్దె బకాయిలు, పీఎఫ్ బకాయిలు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా జనరల్ సెక్రటరీ పల్లపాటి లింగరాజు, వైస్ ప్రెసిడెంట్ జీ వనజ, ట్రెజరర్ సంధ్య, జిల్లా నాయకులు జ్యోత్స్న, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతు శ్రీనివాసరావు కుటుంబానికి అండగా ఉంటాం

● డీసీఎంఎస్ చైర్మన్ హరిబాబునాయుడు

గుంటూరు, మే 12(ఆంధ్రజ్యోతి): వడ్డీ వ్యాపారుల చేతిలో వేధింపులకు గురై పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన పొన్నూరుకు చెందిన కౌలు రైతు శ్రీనివాసరావుకు అండగా ఉంటామని డీసీఎంఎస్ చైర్మన్‌గా నియమితులైన వడ్రాణం హరిబాబునాయుడు అన్నారు. గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న కౌలురైతు శ్రీనివాసరావును, కుటుంబసభ్యులను ఆయన సోమవారం ఉదయం పరామర్శించారు. హరిబాబునాయుడు మాట్లాడుతూ వేధింపులకు గురి చేసిన వడ్డీ వ్యాపారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కౌలు రైతు కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పు వెంకట రత్తయ్య తదితరులు ఉన్నారు.

ప్రజలను ప్రభావితం చేస్తున్న పవన్ భావజాలం

● ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ వెల్లడి

గుంటూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): దేశం మీద అమితమైన ప్రేమ, సమాజంపై బాధ్యత, పరిపాలనలో పారదర్శకతపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ముందుకు సాగుతున్న జనసేనాని పవన్ కల్యాణ్ భావజాలం ప్రజలను ఎంతగానో ప్రభావితం చేస్తున్నట్లు ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ తెలిపారు. సోమవారం మంగళగిరిలోని జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయనను పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ల హరి మర్యాద పూర్వకంగా కలిశారు. కూటమి ప్రభుత్వం రికార్డుస్థాయిలో చేపడుతున్న అభివృద్ధి పనులను, సంక్షేమ పథకాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్సీ హరిప్రసాద్ సూచించారు. అనంతరం జనసేన రాష్ట్ర ప్రోగ్రామింగ్ కమిటీ చైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్ (కేకే)ను హరి మర్యాదపూర్వకంగా కలిశారు.

రైల్వేస్టేషన్‌లో స్కౌట్స్ సేవలు

గుంటూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు గుంటూరు రైల్వేస్టేషన్‌లో ప్రస్తుత వేసవి కాలంలో అందిస్తున్న సేవలు స్ఫూర్తిదాయకంగా ఉంటున్నాయి. పెరిగిన ఎండల తీవ్రత దృష్ట్యా రైళ్లలో ప్రయాణం చేస్తున్న ప్రయాణికులు దాహార్తి బారిన పడుతున్నారు. రైల్వేస్టేషన్‌లో రైలు ఆగినప్పుడు మంచినీళ్ల కోసం వందల సంఖ్యలో దిగి కుళాయిల వద్దకు పరుగులు పెడుతున్నారు. అయితే కొన్ని రైళ్లకు ఇక్కడ తక్కువ సమయం స్టాపేజ్ ఉండటం వల్ల అవి వెంటనే కదులుతుండటంతో నీళ్లు పట్టుకోకుండానే రైలు ఎక్కాల్సి వస్తున్నది. ఈ నేపథ్యంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు మంచినీళ్లను ప్రయాణికుల భోగీల వద్దకే తీసుకెళ్లి వాళ్ల బాటిళ్లలో నింపుతూ సహకరిస్తున్నారు. అలానే దాతల సహకారం తీసుకొని మజ్జిగ కూడా పంపిణీ చేస్తున్నారు.



తాగునీరు సరఫరా చేస్తున్న భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు

పాస్టర్ ప్రవీణ్ సంస్మరణ ప్రార్థన సభను జయప్రదం చేయాలి

గుంటూరు(తూర్పు), మే 12(ఆంధ్రజ్యోతి): స్థానిక లాడ్జీ సెంటర్, ఎల్ఈఎం మైదానంలో ఈనెల 23న జరిగే పాస్టర్ ప్రవీణ్ సంస్మరణ ప్రార్థన సభను జయప్రదం చేయాలని ప్రముఖ సామాజికవేత్త, డాక్టర్ గోళ్ళమూడి రాజా సుందరంబాబు పిలుపునిచ్చారు. స్థానిక అరండల్‌పేట, ఓ హోటల్లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి వివరాలను వెల్లడించారు. సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో దళిత సంఘ నాయకులు, ఆయా చర్చిల పాస్టర్లు పాల్గొంటారని వివరించారు. సభకు ముందు పాత గుంటూరు నుంచి సభాస్థలి వరకు ఆలిండియా క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ (ఐక్య) ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మద్దు ప్రేమ జ్యోతిబాబు, ఆరుమళ్ళ మార్క్, గద్దె రత్నకుమారి, జకిన్, పీ సురేష్ జేమ్స్, కే హేబెల్, నల్లపు నీలాంబరం, డొక్కా జార్జి తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ దంపతులు బెదిరిస్తున్నారు

● ఎస్పీ కార్యాలయంలో బాధితురాలి ఫిర్యాదు

గుంటూరు, మే 12 (ఆంధ్రజ్యోతి) : ఓ ఫైనాన్స్ కంపెనీ ఆన్‌లైన్లో రేకుల ఇంటిని వేలం వేయగా తాము కొనుగోలు చేశామని, అయితే ఆ ఇల్లు తమదేనని కానిస్టేబుల్ దంపతులు ఆక్రమించి తమను బెదిరిస్తున్నారని గురజాల మండలం చర్లగుడిపాడుకు చెందిన పట్టెల అలేఖ్య సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. జేఎం ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌కు సంబంధించిన పెరమిల్ క్యాపిటల్ అండ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ సంస్థ ఈ ఏడాది మార్చి 20 ఆర్ అగ్రహారంలో 150 చదరపు గజాలలో ఉన్న రేకుల షెడ్డు ఇంటిని ఆన్‌లైన్లో వేలం వేసింది అన్నారు. వేలంలో తాను 32 లక్షల 52 వేలకు దానిని కొనుగోలు చేయగా, ఏప్రిల్ 16న తమ పేరిట రిజిస్ట్రేషన్ కూడా చేశారన్నారు. అయితే ఆ రేకుల షెడ్డుకు మరమ్మతులు చేయించేందుకు తాము వెళ్లగా వెస్ట్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న ఏసేపు, ఆయన భార్య వహీదా, ఎదురింటికి చెందిన శ్రీకాంత్, సౌజన్య అనేవారు ఆ ఇల్లు తమదేనని, తమపై దౌర్జనం చేసి దాడికి పాల్పడ్డారన్నారు. తాళాలు పగులగొట్టి దౌర్జన్యంగా ఇంట్లోకి వెళ్లి ఆక్రమించి తమను బెదిరిస్తున్నారన్నారు.

కుమారుడు, డబ్బు, నగలతో భార్య వెళ్లిపోయిందని...

తన భార్య ఐదేళ్ల కుమారుడుతో పాటు రూ.16 లక్షల నగదు, బంగారం, ఆస్తి పత్రాలు తీసుకొని వేరొకరితో వెళ్లిపోయిందని కడపకు చెందిన మహేంద్రా అనే దివ్యాంగుడు సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. 2018లో తనకు వివాహం జరిగిందని, తమకు కుమారుడు ఉన్నాడని అన్నాడు. తాను కడపలో ఆయిల్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ ఉంటానని తెలిపారు. అయితే ఇటీవల తన భార్య ఇంట్లో ఉన్న 16 లక్షల నగదు, బంగారం, వెండితో పాటు ఆస్తి పత్రాలు తీసుకొని వేరొకరితో వెళ్లిపోయిందన్నారు. అప్పటి నుంచి గాలించగా తాడేపల్లి పరిధిలోని సీతానగర్‌లో ఉంటున్నట్టు తెలుసుకొని అక్కడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానన్నారు. అయితే తాడేపల్లి పోలీసులు ఆమెనే సమర్థిస్తున్నారన్నారు. అయితే తన కొడుకు ఆచూకీ లేదన్నారు. ఈ విషయమై తెలుసుకునేందుకు అక్కడికి వెళ్లగా తన భార్యతో పాటు ఆమెతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న వ్యక్తి, మరికొందరు వ్యక్తులు తనపై దాడి చేసి కొట్టారన్నారు.

యువకుడిపై బాలిక కుటుంబ సభ్యుల దాడి

అరండల్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని శారదాకాలనీకి చెందిన ఓ బాలిక బ్రాడీపేట స్కూల్లో పదో తరగతి చదువుతోంది. ఆ సమయంలో ఆమెకు జీవన్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. అప్పటి నుంచి బాలిక చుట్టూ తిరుగుతుండగా ఆమె కుటుంబసభ్యులు గతంలో పలు దఫాలు హెచ్చరించారు. అయినా జీవన్ పద్ధతి మార్చుకోకుండా ఆ బాలిక వెంట తిరుగుతూ ఉండడంతో సోమవారం రాత్రి అమరావతి రోడ్డులో బాలిక తండ్రి, బాబాయి, మరికొందరు కుటుంబసభ్యులు జీవన్‌పై దాడి చేసి కొట్టారు. దీంతో బాధితుడు జీవన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా అన్నమయ్య జయంతి వేడుకలు

గుంటూరు (తూర్పు), మే 12 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని అన్నమాచార్య విగ్రహం వద్ద గాయత్రీ మహిళా సంగీత సన్మండలి, ఆలయ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం అన్నమాచార్య జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మూల కార్యక్రమంలో గాయత్రీ సంగీత సన్మండలి ప్రధాన కార్యదర్శి ఎంవై శేష రాణి, డాక్టర్ మైలవరపు లలితకుమారి, ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, పుట్టగుంట ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం

గుంటూరు(తూర్పు), మే 12 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో భారతీధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో వైశాఖ పౌర్ణమి సందర్భంగా సోమవారం చండీ హోమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. బొల్లేపల్లి సత్యనారాయణ లలితాంబ దంపతులతో 9 మంది వేదపండితుల నిర్వహణలో గణపతికి, శివలింగానికి, నవగ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు, రుద్ర, లక్ష్మీగణపతి, చండీ హోమాలు నిర్వహించి పూర్ణాహుతి చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, ఉపాధ్యక్షుడు లంకా విజయబాబు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, పుట్టగుంట ప్రభాకరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రైవేటు టీచర్లకు హెల్త్ కార్డుల మంజూరు చేయాలి

● మంత్రి లోకేశ్‌కు ఎమ్మెల్యే నసీర్ వినతి



మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, మే 12(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు టీచర్లకు హెల్త్ కార్డుల మంజూరు చేయాలని, ఉర్దూ భాషాభివృద్ధికి ప్రాధాన్యమివ్వాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌ను గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ కోరారు. రాష్ట్ర సచివాలయంలో సోమవారం మంత్రి లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆయన పలు సమస్యలపై వినతిపత్రం అందించారు. రాష్ట్రంలో ప్రైవేటు పాఠశాలల్లో పని చేసే టీచర్లు విద్యార్థులను తీర్చి దిద్దడంలో శక్తివంచన లేకుండా పని చేస్తున్నారని, వారు ఆరోగ్యపరంగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అనారోగ్యానికి గురైనప్పుడు చికిత్స పొందే స్థోమత లేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రైవేటు టీచర్లకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని విన్నవించారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉర్దూ సాహిత్యానికి ప్రోత్సాహం, ఉర్దూ మాధ్యమంలో చదివే విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయడంపై సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలో డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ ప్రస్తుతం కర్నూలులో మాత్రమే ఉందని, అమరావతి రాజధానిలో కూడా యూనివర్సిటీ రీజనల్ బ్రాంచ్ ఏర్పాటు చేయాలని కోరారు. ఉన్నత పాఠశాలల్లోనూ ఉర్దూ భాషాభివృద్ధికి ప్రాధాన్యమివ్వాలన్నారు. సమస్యలను సావధానంగా ఆలకించిన మంత్రి లోకేశ్ ప్రతి సమస్య పరిష్కారంపై తగిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే నసీర్‌కు హామీ ఇచ్చారు.



అన్నదాన కార్యక్రమంలో వడ్డిస్తున్న దేగల ప్రభాకర్

గోవర్ధన గిరిధారి సమితి సేవలు అభినందనీయం


● ఏపీ ఇండస్ట్రియల్ కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్

గుంటూరు, మే 12(ఆంధ్రజ్యోతి): మానవ సేవయే మాధవ సేవ అనే రీతిలో గోవర్ధన గిరిధారి సేవా సమితి చేస్తున్న నిరంతరం సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్ అన్నారు. సేవాసమితి 5 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం గోరంట్లలోని సమర్థనమ్ ట్రస్ట్ ఫర్ ది డిజేబుల్డ్ విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని దేగల ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత ఇలాంటి సేవ కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. ప్రతి ఒక్కరు పేదలకు సేవ చేయాలని పిలుపునిచ్చారు. ఇలాంటి గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించిన సేవా సమితి నిర్వాహకులు చావలి మాధవరాజ్‌ను చైర్మన్ దేగల అభినందించారు. కార్యక్రమంలో తాళ్ల నాగరాజు, కొండెపు శేఖర్‌బాబు, నల్లమేకల శ్రీనివాసరావు, కొండా రవి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుంటూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): నూతన విద్యుత్ లైన్ ఏర్పాటు చేయటంలో భాగంగా సంగడిగుంట లాంచెస్టర్ రోడ్డులో మంగళవారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ ముస్తాక్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

కొండవీడు అభివృద్ధిపై కినుక


కొండవీడుకోట ఏరియల్ వ్యూ

కొండవీడు అభివృద్ధికి టీడీపీ కృషి

- గత టీడీపీ ప్రభుత్వంలో వేగంగా పురోగతి
- వైసీపీ హయాంలో ప్రచార ఆర్భాటమే..
- కూటమి పాలనలో పరుగులందుకునేనా..
- పర్యాటకంగా, ఆధ్యాత్మికంగా ప్రసిద్ధి
- అభివృద్ధి చేస్తే.. ప్రభుత్వానికి ఆదాయం.. ప్రజలకు వినోదం

యడ్లపాడు, మే 12 (ఆంధ్రజ్యోతి): చారిత్రక, ఆధ్యాత్మిక నేపథ్యం కలిగిన కొండవీడుకోట అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఘాట్ రోడ్డు, మెట్ల మార్గం పునరుద్ధరణ, ఇతర మౌలిక సదుపాయాలు మినహా ఇక్కడ ఎలాంటి అభివృద్ధి ఆనవాళ్లు అగుపించడం లేదు. ప్రపంచ పర్యాటక కేంద్రంగా కొండవీడును తీర్చిదిద్దుతామన్న నేతల మాటలు నీటి మూటలుగా మిగిలిపోతున్నాయి. గత బడ్జెట్ సమావేశాల్లో స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కొండవీడు కోట అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని పర్యాటకశాఖ మంత్రిని కోరారు. కేంద్రమంత్రి పెమ్మసాని, ఎంపీ లావుకు కేంద్రం నుంచి నిధులు కేటాయించేలా కృషిచేయాలని విజ్ఞప్తి చేశారు. నేటికీ ఈ ప్రాంత అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

రెడ్డిరాజులు 14వ శతాబ్దం ప్రారంభంలో శతృదుర్భేద్యమైన కొండవీడుకోటను నిర్మించారు. కోట రక్షణ వ్యవస్థలో భాగంగా కొండల శిఖరాలపై 24 బురుజులు నిర్మించి, ఒకదానితో ఒకటి కలుపుతూ 20 కి.మీల మేర రాతిగోడను నిర్మించారు. వీటితోపాటు కోటలో అనేక దేవాలయాలు, మండపాలు, నీటి వసతి కోసం గొలుసుకట్టు చెరువులు, నేతి కొట్టు, బుంగబావి, నీటి బావులు, నాలుగు వైపులా ప్రవేశకోసం ముఖద్వారాలు నిర్మించారు. వీటిలో చాలా నిర్మాణాలు శిథిలావస్థకు చేరి కొన్ని రూపురేఖలు కోల్పోయి నామమాత్రంగా దర్శనమిస్తున్నాయి. 2014లో టీడీపీ ప్రభుత్వం కొండవీడు ప్రాంత అభివృద్ధికి విశేష కృషిచేసింది. అప్పటి మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఈ ప్రాంత అభివృద్ధికి విశేష కృషిచేశారు. పర్యాటకులు కొండవీడు కోటకు చేరుకునేందుకు వీలుగా ఘాట్ రోడ్డు నిర్మాణం, కోట వైపు నుంచి పురాతన మెట్లమార్గం, రాతి గోడ, ముఖ ద్వారాల పునరుద్ధరణ, శిథిలమైన దేవాలయాలు, మండపాల జీర్ణోద్ధరణ, కొండలపై ఉన్న వెదుళ్ల ముత్యాలమ్మ, పుట్టాలమ్మ చెరువులను అభివృద్ధి చేశారు. కోట గ్రామంలోని కత్తుల బావిగా పిలువబడే వేణుగోపాల స్వామి ఆలయం పునరుద్ధరణ చేసి, చిల్డ్రన్ పార్కు ఏర్పాటు వంటి అంశాలతో సమగ్రమైన డీపీఆర్‌ను రూపొందించారు. మ్యూజియం, వేద పాఠశాల, రిసార్ట్స్, ఔషధ పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. పురావస్తు, అటవీ, ఆర్‌అండ్‌బీ, పర్యాటక శాఖలను సమన్వయ పరుస్తూ కొండవీడు అభివృద్ధికి బాటలు వేశారు. ఐదేళ్ల సుమారు రూ.50కోట్ల విలువైన అభివృద్ధి పనులను చేపట్టారు. తొలిదశ 5.1 కిలోమీటర్ల ఘాట్ రోడ్డు, 1.5 కిలోమీటర్ల మెట్లమార్గం, కొండలపై ఉన్న మూడు చెరువుల అభివృద్ధి, నరసింహస్వామి దేవాలయం పునరుద్ధరణ పనులు 70శాతం మేర పూర్తి చేసింది. రెండో దశ 650 మీటర్ల ఘాట్ రోడ్డు నిర్మాణానికి అనుమతులు తెచ్చి సుమారు రూ.11 కోట్లతో టెండర్లను పిలిచి పనులను అప్పగించింది.


పునరుద్ధరించాల్సిన కోట గ్రామంలోని కత్తులబావి

వైసీపీ ప్రభుత్వ హయాంలో

వైసీపీ ప్రభుత్వం కొండవీడు ప్రాంత అభివృద్ధిని నిర్లక్ష్యం చేసింది. టీడీపీ ప్రభుత్వం రూ.200 కోట్లతో రూపొందించిన సమగ్రమైన డీపీఆర్‌ను ప్రక్కన పెట్టి రూ.13.25 కోట్లతో ఐదేళ్ల కాలానికి కొత్త డీపీఆర్‌ను రూపొందించింది. అయితే వీటిలో టీడీపీ హయాంలో 70 శాతం మేర పూర్తి చేసిన లక్ష్మీనరసింహస్వామి దేవాలయం, 650 మీటర్ల రెండో దశ ఘాట్‌రోడ్డు నిర్మాణం మినహా ఎలాంటి పునరుద్ధరణ పనులను చేపట్టలేదు. రూ.85 లక్షల వ్యయంతో చేపట్టిన శివాలయం పునరుద్ధరణ పనులు పునాదిలోనే నిలిచిపోయింది. మరుగుదొడ్లు నిర్వహణ లేక మూలన పడ్డాయి. గతంలో సీఎం చంద్రబాబు సమయంలో ప్రపంచస్థాయి రిసార్ట్స్ నిర్మాణానికి గొల్కొండ సంస్థల అధినేత నడికట్టు రామిరెడ్డి ముందుకు వచ్చారు. వచ్చిన వైసీపీ ప్రభుత్వం నుంచి ఆయనకు సరైన సహకారం లభించలేదు.


కొండవీడుకోట ఘాట్ మార్గం


ఆరంభంలోనే నిలిచిపోయిన శివాలయం

శాఖల సమన్వయ లోపం

ఎంతో ఉన్నతంగా ఊహించుకుని కొండవీడు కోటకు వస్తున్న పర్యాటకులకు సంతృప్తి లభించడం లేదు. వాస్తవంలో వారు ఊహించిన వాతావరణం ఇక్కడ కనిపించడం లేదు. దీనికి పురావస్తు, అటవీ, దేవదాయ, ఆర్‌అండ్‌బీ, పర్యాటకశాఖల మధ్య సమన్వయ లోపం, అధికారుల అలసత్వం ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

భద్రతకు ప్రాధాన్యం

కొండవీడుకోట సమగ్ర అభివృద్ధితో పాటు ఇక్కడకు వచ్చే సందర్శకుల భద్రతకు కూడా ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఘాట్ మార్గంలో తరచూ కొండ చరియలు విరిగిపడుతున్నాయి. గతేడాది సెప్టెంబరులో కురిసిన వర్షాలకు భారీగా కొండ చరియలు విరిగిపడి నెల రోజుల పాటు ఘాట్ మార్గాన్ని మూసివేశారు. కొండ చరియలు జారిపడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

చేయాల్సిన అభివృద్ధి పనులు

- యువతను ఆకర్షించే విధంగా సాహస క్రీడలు హార్స్ రైడింగ్, ట్రెక్కింగ్, రాఫ్టింగ్, బోటింగ్, ఏటీవి వెహికల్ రైడింగ్, ఆర్చరీ వంటి వాటిని నిర్వహించాలి.
- కొండలపై చుట్టొచ్చే విధంగా రోప్‌వే నిర్మాణం చేయడం, చెరువుల్లో 365 రోజులూ నీటి స్థిరీకరణ చేయాలి.
- రెడ్డిరాజులు వసంత రుతువులో విదేశాల నుంచి ఖరీదైన సుగంధ ద్రవ్యాలను తెప్పించి వైభవంగా వసంతోత్సవం నిర్వహించేవారని, కర్పూర ఖండాలను ప్రజలపై చల్లేవారని ఖ్యాతి. ప్రభుత్వం దీనిని దృష్టిలో ఉంచుకుని ఏటా వసంతోత్సవం, వేమన జయంతి ఉత్సవాలను నిర్వహిస్తే ఈ ప్రాంతానికి మరింత ప్రాచుర్యాన్ని తీసుకురావచ్చు.
- ప్రతిపాదన దశలో నిలిచిపోయిన ఎకో పార్కును పట్టాలెక్కించాలి. ఔషధ మొక్కలు విరివిగా ఉన్న ఈ ప్రాంతం మెడికల్ టూరిజంకు అవకాశాన్ని కల్పిస్తుంది. తరచూ కవితా గోష్ఠులను ఇక్కడ నిర్వహించడం వంటివి చేయాలి.
- ప్రణాళిక ప్రకారం వీటిని చేపట్టి నిర్వహిస్తే ఈ ప్రాంతం ఆధ్యాత్మిక, చారిత్రక పర్యాటక కేంద్రంగా విలసిల్లే అవకాశం ఉంది.



వైసీపీ హయాంలో.. మరింత దారుణం

గత వైసీపీ హయాంలో తెనాలి వ్యవసాయమార్కెట్ యార్డు ప్రాంగణంలో అభివృద్ధి పనులకు ముందుకు రాలేదు. పైగా ఏళ్ల తరబడి ఉన్న వివిధ వృక్షాలను నరికి, వాటి దుంగలను తరలించుకున్నారు. అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తెనాలిలో రైతు భరోసా సభను పెట్టుకునేందుకు యార్డు ప్రాంగణాన్ని ఎంపిక చేశారు. ఆ సమయంలో యార్డు గోడను సైతం పగులగొట్టి.. కార్లు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. తిరిగి గోడను నిర్మించలేదు. మౌలిక వసతులు కల్పించకపోగా ఉన్న వాటిని కూడా ఈ విధంగా ధ్వంసం చేయడంతో రైతులు తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. ముఖ్యంగా అందరినీ ఆకర్షించేలా ఎడ్లబండితో రైతు పంటలను తీసుకువస్తున్న విగ్రహాలను యార్డు బయట ఏర్పాటు చేశారు. దీనిని చూసిన రైతులు లోపల సేవలు లేవు.. బయట ఆర్భాటం ఏంటో అంటూ నిష్టూర పోయారు.

ఎట్టకేలకు.. యార్డు అభివృద్ధికి మోక్షం..!

- దృష్టిసారించిన కూటమి ప్రభుత్వం
- మార్కెట్ యార్డులో మౌలిక వసతుల కల్పన
- తెనాలి యార్డులో రూ.1.40 కోట్లతో సీసీ రోడ్డు, మరుగుదొడ్లు
- వైసీపీ హయాంలో జగన్ సభకు చెట్లు, గోడల కూల్చివేత

తెనాలి రూరల్, మే12(ఆంధ్రజ్యోతి): పంట ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునేందుకు, ధాన్యం నిల్వచేసేందుకు తెనాలిలో ఏర్పాటు చేసిన వ్యవసాయమార్కెట్ యార్డులో ఎట్టకేలకు అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. ఐదేళ్ల వైసీపీ పాలనలో యార్డు అభివృద్ధి కుంటుపడింది. రైతాంగాన్ని తీవ్ర నిరాశకు గురిచేసింది. నిమ్మ, ధాన్యం, ఇతర పంట ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునేందుకు ఈ యార్డు పెట్టింది పేరు. తెనాలి, కొల్లిపర, చుండూరు, దుగ్గిరాల వంటి పలు ప్రాంతాల నుండి రైతులు నిమ్మకాయలను యార్డుకు తీసుకువచ్చి అమ్మకాలు జరుపుతుంటారు. ఇక్కడి వివిధ రాష్ట్రాలకు ఎగుమతులవుతాయి. నిత్యం వందలాది మంది రైతులు వచ్చిపోయే మార్కెట్ యార్డు ప్రాంగణంలో కనీస మౌలిక వసతులు కూడా లేవంటే అతిశయోక్తి కాదు. ఇక్కడ మరుగుదొడ్లు కూడా అందుబాటులో లేవు. దీంతో బహిరంగ ప్రదేశాలను ఆశ్రయించక తప్పట్లేదు. కూటమి ప్రభుత్వం కొలుదీరిన అనంతరం వ్యవసాయ మార్కెట్ యార్డులలో ప్రధాన సమస్యలపై ప్రత్యేక దృష్టిపెట్టింది. అందులో భాగంగా తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డులో నూతనంగా సిమెంట్ రోడ్లు, స్త్రీ, పురుషులకు వేర్వేరుగా మరుగుదొడ్ల నిర్మాణానికి సుమారు రూ1.40 కోట్లతో పనులు ప్రారంభించారు. ప్రస్తుతం అవి నిర్మాణ దశలో ఉన్నాయి. అన్న క్యాంటిన్‌ను యార్డు ప్రాంగణంలో జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు వచ్చేవారు సైతం వినియోగించుకునేలా ఏర్పాటు చేశారు.


యార్డులో నూతనంగా సిమెంట్‌రోడ్లకు జరుగుతున్న పనులు


యార్డులో రైతులకు కోసం నిర్మిస్తున్న మరుగుదొడ్లు

ఇంకా చేయాల్సింది కొండంత..

తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డులో అభివృద్ధిపనులు మరిన్ని చేయాల్సి ఉంది. ఏళ్లనాడు కట్టిన గోడౌన్‌ల నిర్వహణలో లోపాలు అనేకమున్నాయి. గోడలకు రంగులు పోవడంతో పాటు పైకప్పులు సైతం అక్కడక్కడా దెబ్బతిన్నాయి. ఇక షెట్టర్లకు సకాలంలో గ్రీజు వంటివి పెట్టకపోవడం, ఏళ్ల నాటివి కావడంతో అవికూడా మార్చాల్సి ఉంది. గోడౌన్లకు ఉన్న కిటికీలు కూడా దెబ్బతిన్నాయి. భద్రపరిచిన ధాన్యాన్ని ఎలుకలు పాడుచేసే అవకాశం ఉంది. యార్డు చుట్టూ ప్రహరీ నిర్మించాల్సి ఉంది. వీటిపై కూడా ప్రభుత్వం దృష్టిపెడితే రైతాంగానికి ఎంతో మేలు కలుగుతుంది.



ఉన్నతాధికారులకు నివేదిక

యార్డు కార్యదర్శి సుబ్బారావు

కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక యార్డుల్లో సమస్యలపై నివేదిక కోరింది. దీంతో సమస్యలను ప్రభుత్వానికి నివేదించడం జరిగింది. త్వరలోనే పూర్తిస్థాయిలో యార్డును తీర్చిదిద్దుతామని తెనాలి యార్డు కార్యదర్శి సుబ్బారావు తెలిపారు.

ఉపాధి శ్రామికులకు బీమా భరోసా..!

- సహజ, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2లక్షల పరిహారం
- అంగీకార పత్రం అందిస్తే.. ప్రభుత్వమే నగదు చెల్లింపు
- పని ప్రదేశంలో భద్రతకు ప్రభుత్వాలు కృషి


ఉపాధి పనులు చేస్తున్న శ్రామికులు

నకరికల్లు, మే 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమల్లో కూటమి ప్రభుత్వం వినూత్న మార్పులకు శ్రీకారం చుట్టింది. ఉపాధి కల్పించడమే గాక, ఉపాధి పనులకు వెళ్లిన సమయంలో పని ప్రదేశంలో ప్రమాదవశాత్తు శ్రామికులు చనిపోతే రూ.2 లక్షల ఆర్థిక సాయం అందించే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉపాధి శ్రామికుల జీవితాలకు భద్రత కల్పించాలని పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్ సూచనలతో ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశి భూషణ్ కుమార్ ఈ మేరకు జీవో విడుదల చేశారు. దీంతో రూ.50 వేలుగా ఉన్న పరిహారం.. రూ.2 లక్షలకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

ప్రధాన మంత్రి సురక్షా బీమా..

ఉపాధి పనులకు వెళ్లిన శ్రామికులు ప్రమాదవశాత్తు మరణిస్తే ప్రభుత్వం రూ.2 లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని అందిస్తుంది. వేతనంలో రూ.20లు చెల్లించమనే అంగీకార పత్రాన్ని ఉపాధి హామీ కార్యాలయంలో అందివ్వాలి. దీంతో శ్రామికుని పేరుతో ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన ద్వారా ప్రభుత్వమే బీమా నగదు రూ.20 చెల్లిస్తుంది. ఈ ప్రమాద బీమా 70 ఏళ్ల వయస్సు వరకు వర్తిస్తుంది.

ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా..

ఉపాధి పనులకు వెళ్లిన శ్రామికులు సహజ మరణం పొందినా, ప్రమాదవశాత్తు మరణించినా.. రూ.2 లక్షలు బీమా అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందుకు ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన ద్వారా రూ.430లు తనకు వచ్చే వేతనం నుంచి చెల్లించమని అంగీకార పత్రం శ్రామికులు ఉపాధి కార్యాలయంలో అందించాలి.

ఆర్థిక స్థితి కలిగిన వారు మాత్రమే పొందగలిగే బీమా పథకాలను ఉపాధి శ్రామికులకు ప్రభుత్వం కల్పిస్తోంది. దీంతో ఉపాధి శ్రామికులందరికీ బీమా రక్షణ కల్పిస్తోంది.

ఉపాధి కుటుంబాలకు బీమా రక్షణ



పల్నాడు జిల్లాలో 3.42 లక్షల ఉపాధి హామీ జాబ్ కార్డులు ఉన్నాయి. 5.88 లక్షల మంది ఉపాధి శ్రామికులు ఉన్నారు. రూ.20 తో ప్రమాద బీమా, రూ.436 తో సాధారణ, ప్రమాద బీమాలు ఉపాధి శ్రామికులకు అందుబాటులో ఉన్నాయి.

-సిద్ధ లింగమూర్తి, పీడీ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, పల్నాడు











మండుటెండకు.. ముఖం చాటేస్తూ..!

భానుడి దెబ్బకు జనం బెంబేలెత్తిపోయారు. సోమవారం 44 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 7 గంటల నుంచే ఎండ ప్రభావం చూపింది. వివిధ పనుల నిమిత్తం బయటకు వచ్చిన ప్రజలు ఉదయం 10 గంటల కల్లా ఇళ్లకు చేరుకున్నారు. కొన్ని రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. ఎండ దెబ్బ తగలకుండా ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తలకు తువ్వాలు, చేతి రుమాలు, చున్నీ రక్షణ కవచంలా ధరించారు. వాహనాలపై వెళ్లేవారు వేడి సెగ తాకకుండా ముఖాలను పూర్తిగా కప్పేసుకున్నారు.

-గుంటూరు, ఆంధ్రజ్యోతి

గుంటూరు రూరల్ వార్తలు

దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, మే 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపు మార్కెట్ యార్డులో సోమవారం జరిగిన వేలంలో 991 బస్తాల పసుపు విక్రయాలు జరిగాయి. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.10,000, గరిష్ఠధర రూ.11,400, మోడల్‌ధర రూ.10,450 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.10,101, గరిష్ఠధర రూ.11,300 మోడల్‌ధర రూ.10,450 పలికాయి.

చిగురులో సమ్మర్ క్యాంపు

తాడేపల్లి (ఉండవల్లి), మే 12 (ఆంధ్రజ్యోతి): ఉండవల్లి కరకట్ట వద్ద ఉన్న డాన్‌బాస్కో నవజీవన్ బాలభవన్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటైన చిగురు బాలల గ్రామంలో సోమవారం నెల రోజుల సమ్మర్ క్యాంపును సంస్థ డైరెక్టర్ రత్న ఫాదర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమ్మర్ క్యాంపులో సైబర్ క్రైమ్, బాలల హక్కులు, స్కిల్ ఎడ్యుకేషన్, క్రాఫ్ట్, ఆర్ట్ వర్క్‌లు, ఆటలు, పాటలు డ్రాయింగ్‌పై అవగాహన కల్పిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో చిగురు బాలల గ్రామం సిబ్బంది, చిన్నారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించారు.

మురుగుకాలువల్లో పూడిక తీత



పూడికతీత పనులు నిర్వహిస్తున్న కార్మికులు

తాడేపల్లి టౌన్, మే 12, (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణంలోని కొత్తూరులో మాజీ సీఎం జగన్ హెలిపాడ్ సమీపంలో సోమవారం మురుగుకాలువలో పారిశుధ్య కార్మికులు పూడికతీత పనులు చేపట్టారు. సుమారు 600 గజాల దూరం ఉన్న డ్రైనేజీ వ్యవస్థను శుభ్రం చేశారు. కొబ్బరి బోండాలు, ఇతర వ్యర్థాలు, మురుగు కాలువల్లో పడవేయొద్దని మున్సిపల్ అధికారులు సూచించారు.

11 మంది జూదరుల అరెస్టు

కాకుమాను, మే 12(ఆంధ్రజ్యోతి): 11 మంది జూదరులను మండల పరిధిలోని బీకే పాలెంలో అరెస్టు చేశారు. ఎస్ఐ పృథ్వీ ఏక్‌నాథ్ తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని బీకే పాలెంలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో సిబ్బందితో దాడి చేసి 11 మంది జూదరులను అరెస్టు చేసి వారి నుంచి రూ.25,720 స్వాధీనం చేసుకున్నట్లు సోమవారం తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్‌లు రత్న ప్రభాకర్, చిరంజీవి పాల్గొన్నారు.

16న సర్వసభ్య సమావేశం

కాకుమాను, మే 12(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 16న జరుగుతుందని మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల అభివృద్ధికి ప్రణాళికల వివరాల గురించి జరిగే చర్చ కార్యక్రమంలో మండల స్థాయి ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొనున్నట్లు వెల్లడించారు.

నేడు పోలేరమ్మ తిరునాళ్ల

కాకుమాను, మే 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిన్నలింగాయపాలెంలో కొలువై ఉన్న శ్రీపోలేరమ్మ అమ్మవారి తిరునాళ్ల మంగళవారం జరుగుతుందని ఆలయ నిర్వాహకులు సోమవారం తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని నిర్వాహకులు తెలిపారు.

రాధారంగానగర్‌లో వైద్యసేవలు

తాడేపల్లి(వడ్డేశ్వరం), మే 12 (ఆంధ్రజ్యోతి): వడ్డేశ్వరంలోని రాధారంగానగర్‌లో మంత్రి నారా లోకేశ్ పంపిన సంజీవని ఆరోగ్య రథం ద్వారా స్థానికులు ఉచిత వైద్యసేవలు పొందారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 70మంది వైద్య పరీక్షలు నిర్వహించుకొని ఉచితంగా మందులు పొందారు. సీనియర్ టీడీపీ నాయకులు కాట్రగడ్డ మధుసూదనరావు మాట్లాడుతూ మంత్రి లోకేశ్ నియోజకవర్గంలో చేస్తున్న పలు రకాల సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలు సేవలు పొందుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వడ్డేశ్వరం గ్రామ అధ్యక్షుడు ఈపూరి కోటయ్య, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం

తాడికొండ, మే 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేణుగోపాల స్వా మి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం అత్యంత వైభవంగా రథోత్సవాన్ని తూర్పువీధి కమ్మవారు, గ్రామ ప్రజల సహకారం తో నిర్వహించారు. రథంపై వేణుగోపాలస్వామిని, ఉభయ దేవేరులను ఉంచి గ్రామంలో రథోత్సవాన్ని జరిపారు. రథోత్సవం ప్రారంభానికి ముందు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారు, ఉభయ దేవేరులు గరుడ వాహనంపై గ్రామంలో ఊరేగించారు. ముందుగా వేణుగోపాల స్వామి గుడి నుంచి రావి చెట్టు సెంటర్ వరకు, అక్కడి నుంచి మెయిన్ రోడ్డు మీదుగా బస్టాండ్ సెంటర్, జెండాచెట్టు, చింతచెట్టు సెంటర్ వరకు రథోత్సవాన్ని నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. భారీ సంఖ్యలో గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

చలపతి కళాశాలలో వైద్యశిబిరం

తాడికొండ(లాం), మే 12(ఆంధ్రజ్యోతి): లాం చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో మెగా వైద్యశిబిరాన్ని సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ ఎం చంద్రశేఖర్ ప్రారంభించారు. గుంటూరుకు చెందిన మెడిక్స్ హస్పిటల్ సహకారంతో విద్యార్థులు, అధ్యాపకులు, కళాశాల సిబ్బందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. 1500 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అంతేకాకుండా బీపీ, షుగర్, గ్యాస్ సంబంధిత పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డీ తిరుపతి నాయుడు, ఆర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వారు ఆగరు.. వీరు ఆపరు

- 5వ మైలు వద్ద రోడ్డు వెంట కంపెనీ వ్యర్థాలు డంప్
- అక్కడే తగల బెడుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు





గుంటూరు - పర్చూరు రహదారిలో ఐదో మైలు వద్ద రోడ్డు వెంట వేస్తున్న ప్రత్తి మిల్లు వ్యర్థాలు

ప్రత్తిపాడు, మే 12 (ఆంధ్రజ్యోతి): గుంటూరు - పర్చూరు ప్రధాన రహదారిలో ఐదో మైలు సమీపంలో ప్రత్తి కంపెనీల నుంచి వచ్చే వర్థాల డంప్ ఆగటం లేదు. చాలా కాలం నుంచి ఈ రహదారిలో రోడ్డు వెంట సమీపంలోని ప్రత్తి మిల్లులు, కంపెనీల నుంచి వచ్చే వ్యర్థాలను ఇక్కడ డంప్ చేసి తగల బెట్టడం ఆనవాయితీగా మారింది. ఒక వైపు ప్రభుత్వం స్వచ్ఛతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు డంపింగ్ యార్డులను అభివృద్ధి చేసి గ్రామాలను స్వచ్ఛత వైపు పరుగులు పెట్టిస్తుంటే.. ఇక్కడ మాత్రం ఆ ఆనవాళ్లు ఎక్కడా కనిపించడం లేదు. నిత్యం ప్రధాన రహదారిలో అధికారులు, పాలకులు తిరుగుతూనే ఉంటారు. కానీ ఎవరికీ ఇక్కడ వేస్తున్న వ్యర్థాలు మాత్రం కనిపించడం లేదు. ఈ రహదారిలో ఉన్న బ్రిడ్జికి కూత వేటు దూరంలో ప్రత్తిపాడు వైపు వచ్చే రోడ్డులో ఈ వ్యర్థాలను డంప్ చేస్తున్నారు. ట్రక్కుల్లో తెచ్చి ఇక్కడ వేసి ఎంచక్కా వెళ్లిపోతున్నారు. గతం నుంచి అధికారులు తమకేమీ సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో మిల్లుల వారు ఆగకుండా వ్యర్థాలను ఇక్కడికి తరలిస్తున్నారు. దీని వల్ల పర్యావరణం దెబ్బతినడంతో పాటు, వాహన చోదకులకు ఇబ్బందికరంగా మారుతుంది. దీనిపై వట్టిచెరుకూరు మండల అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపి రోడ్డు వెంట వ్యర్థాలు వేస్తున్న వారిని కట్టడి చేయాల్సిన అవసరం ఉంది. వీరికి తోడు ఎక్కడెక్కడి నుంచోగృహాల్లోని వ్యర్థాలతో పాటు పగలగొట్టిన పాత ఇంటి రాళ్లు ఇలా.. ఎవరికి వారు ఇష్టమొచ్చినట్లు ఇక్కడ డంప్ చేస్తున్నారు.

నర్సుల సేవలు వెలకట్టలేనివి

- ఎన్నారై అడ్మినిస్ట్రేటర్ విష్ణువర్ధన్‌రావు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న విష్ణువర్ధన్‌రావు

మంగళగిరి, మే 12 (ఆంధ్రజ్యోతి): రోగుల ఆరోగ్య సంరక్షణకు నర్సులు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని చినకాకాని ఎన్నారై వైద్య విద్యాసంస్థల అడ్మినిస్ట్రేటర్ మండవ విష్ణువర్ధన్‌రావు అన్నారు. ఎన్నారై వైద్యశాలలో సోమవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత విష్ణువర్ధన్‌రావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం దేశ రక్షణలో ప్రాణాలు కోల్పోయిన భారత సైనికులకు సంతాపం తెలియజేశారు. విష్ణువర్ధన్‌రావు మాట్లాడుతూ ఆస్పత్రిలో నర్సుల సేవలు ఎంతో కీలకమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నారై డీన్ లక్ష్మీ, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ శివ ప్రబోధ్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కుమార్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ సెక్రెటరీ వెంకటేశ్వరరావు, నర్సింగ్ సూపరింటెండెంట్ డాక్టర్ బైజా తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల పీహెచ్‌సీలో..

దుగ్గిరాల, మే 12 (ఆంధ్రజ్యోతి): ఫ్లారెన్స్ నైటింగేల్ స్ఫూర్తితో నర్సులు రోగులకు వైద్య సేవలు అందించాలని దుగ్గిరాల పీహెచ్‌సీ వైద్యురాలు ఇందిర అన్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా నర్సులందరి సమక్షంలో కేక్‌కట్ చేశారు. పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ వంకదార సుబ్బారావు, నర్సింగ్ విద్యార్థినులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలను ప్రభావితం చేస్తున్న పవన్ భావజాలం

- ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ వెల్లడి



ఎమ్మెల్సీ హరిప్రసాద్, కేకేతో ఆళ్ల హరి

గుంటూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): దేశం మీద అమితమైన ప్రేమ, సమాజంపై బాధ్యత, పరిపాలనలో పారదర్శకతపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ముందుకు సాగుతున్న జనసేనాని పవన్ కల్యాణ్ భావజాలం ప్రజలను ఎంతగానో ప్రభావితం చేస్తున్నట్లు ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ తెలిపారు. సోమవారం మంగళగిరిలోని జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయనను పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ల హరి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్సీ హరిప్రసాద్ సూచించారు. అనంతరం జనసేన రాష్ట్ర ప్రోగ్రామింగ్ కమిటీ చైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్ (కేకే)ను హరి మర్యాదపూర్వకంగా కలిశారు.

నైపుణ్యం పెంపొందించుకునేందుకు శిక్షణ తరగతులు



విద్యార్థులకు కంప్యూటర్ కోర్స్ సర్టిఫికెట్లు అందజేస్తున్న డాక్టర్ అమర్, తదితరులు

పెదనందిపాడు, మే 12 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యం పెంపొందించుకునేందుకు వేసవి శిక్షణ తరగతులు ఎంతో దోహదపడతాయని చిలకలూరిపేట ప్రగతి నర్సింగ్ హోమ్ వైద్యుడు డా.అమర్ అన్నారు. స్థానిక కొల్లా వెంకయ్య గ్రంథాలయంలో గత రెండు నెలలుగా జరుగుతున్న కంప్యూటర్ శిక్షణా తరగతులు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా డాక్టర్ అమర్ మాట్లాడుతూ ప్రస్తుత టెక్నాలజీ యుగంలో కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతైనా అవసరమన్నారు. కంప్యూటర్ కోర్సు ఏర్పాటు చేసి విద్యార్థులకు అవకాశం కల్పించిన యాజమాన్యాన్ని ప్రత్యేకంగా అభినందించారు. శిక్షణ పొందిన విద్యార్థులకు కోర్సు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని మక్కెన జవహర్ రాణి, డాక్టర్ చిగురుపాటి లిఖిత, విశ్రాంత ఉపాధ్యాయులు గారపాటి రమేష్, కంప్యూటర్ శిక్షకులు సిద్దాబత్తుని నాగేశ్వరరావు, నిర్వాహకులు కొల్లా రామన్, నిర్మల, బోడావుల హనుమంతరావు, కొల్లా వెంకయ్యచౌదరి, లావు చౌడేశ్వరి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.


ఘనంగా వార్షిక వేడుకలు



ప్రత్యేక పూజలందుకున్న శ్రీగంగా పార్వతీ అన్నపూర్ణ సమేత సూర్యేశ్వర, సోమేశ్వరస్వామి

పెదనందిపాడు, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని పాలపర్రులో ఉన్న శ్రీగంగా పార్వతీ అన్నపూర్ణ సమేత సూర్యేశ్వర స్వామి, సోమేశ్వరస్వామి దేవస్థాన తృతీయ వార్షిక వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు సునీల్‌శర్మ స్వామి వార్లకు పంచామృత అభిషేకాలు, పుణ్యాహవచన, 108 రకాల పండ్లతో రసాభిషేకం, గణపతి రుద్రహోమాలు, శాంతి కళ్యాణ మహోత్సవం నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం గ్రామస్థులు, దాతల సహకారంతో అన్నదానం చేశారు. కార్యక్రమాలను కమిటీ నిర్వాహకులు పర్యవేక్షించారు.

స్పందించిన దాతలు



కొళాయిల వద్ద నీటిని పట్టుకుంటున్న గ్రామస్థులు

పెదనందిపాడు, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని నాగులపాడులో ఆరు రోజులుగా తాగునీరు లేక గ్రామస్థులు అవస్థలు పడుతుండడంతో ప్రభుత్వం, అధికారులు స్పందించకపోవడంతో గ్రామస్థులే ముందుకు వచ్చారు. సోమవారం గ్రామానికి చెందిన ఉప్పల శేషారావు ట్యాంకర్ ద్వారా నీరు తెప్పించి సంపులో నింపి కొళాయిల ద్వారా ప్రజలకు నీరు అందించారు. శనివారం ఆంధ్రజ్యోతిలో వెలువడిన దాహార్తిని తీర్చే దారేది.. అనే కథనంతో ప్రభుత్వం స్పందించకపోయినప్పటికీ గ్రామస్థులు స్పందించి తాగు నీరు అందించడంపై కృతజ్ఞతలు తెలిపారు.

నేడు సుబ్బహ్మణ్యేశ్వరుడి కల్యాణ మహోత్సవం

పెదనందిపాడు, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని నాగులపాడు శ్రీవల్లీదేవసేన సమేత సుబ్బహ్మణ్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామికి అర్చకులు విశేష పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఉత్సవ మూర్తులను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. మంగళవారం సుబ్రహ్మణ్యేశ్వస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారని, అనంతరం గ్రామస్థులు, దాతల సహకారంతో అన్నదానం చేపట్టనున్నట్లు తెలిపారు. రైతన్న డెయిరీ ఆధ్వర్యంలో పరిసర ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తులకు ఉచితంగా మజ్జిగ, తాగునీరు సరఫరా చేయనున్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి జయంతి వేడుకలు

పెదనందిపాడు, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని కొప్పర్రులో లక్ష్మీనరసింహస్వామి జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. స్వామికి విశేష పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం దాతల సహకారంతో అన్నదానం చేశారు.



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

మహానాడులోపు టీడీపీ కమిటీల ఏర్పాటు



పెదపరిమి గ్రామ టీడీపీ కమిటీ సభ్యులకు నియామక పత్రం అందజేస్తున్న టీడీపీ రాష్ట్ర నాయకులు

తుళ్లూరు, (పెదపరిమి), మే 12 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ నిర్వహించే మహానాడు (మే 28)లోపు టీడీపీ గ్రామ కమిటీలు, మండల కమిటీలు పూర్తి కావాలని అధిష్ఠానం ఆదేశాల మేరకు సోమవారం మేజర్ గ్రామమైన పెదపరిమి గ్రామ కమిటీ నియామకం జరిగింది. తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుట్టి రామచంద్రరావు ఆధ్వర్యంలో కమిటీ ఎంపిక చేశారు. గ్రామ అధ్యక్షుడిగా బీ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా ఏ సాంబశివరావులను ఆర్థల సాంబశివరావు నియమించారు. ప్రధాన కార్యదర్శిగా బిల్లా నాగేశ్వరరావు, కార్యనిర్వాహక కార్యదర్శిగా భాష్యం లక్ష్మణరావు, మున్నంగి నర్సిరెడ్డి, షేక్ షౌకత్‌అలి, గ్రామ పార్టీ కార్యదర్శులుగా మద్దినేని అంత య్య, పట్టాభిరాజు, అభినందనరావు, కావూరి శేష గిరిరావు, కోశాధికారిగా వినుకొండ శివను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ ఆదేశాల మేరకు కమిటీ నియామకాలు చేస్తున్నట్లు ఈ సందర్భంగా పుట్టి రామచంద్రరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల పరిశీలకులుగా టీడీపీ మండల అధ్యక్షుడు ధనేకుల సుబ్బారావు, క్లస్టర్ ఇన్‌చార్జ్ బెల్లంకొండ నరసింహారావు, క్లస్టర్ -2 ఇన్‌చార్జ్ దామినేని శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ పోతుగుంట నర్సయ్య, తెలుగురైతు రాష్ట్ర అధ్యక్షుడు నూతలపాటి రామారావు, నాయకులు భాష్యం చిన శ్రీధర్, పెద శ్రీధర్, కొండవీటి విజయరాజ్, రాయపాటి హరిబాబు, తదితరులు పాల్గొన్నారు. నేలపాడు గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా ఇందుర్తి దుర్గారావు, ఐనవోలు గ్రామ అధ్యక్షుడిగా పాలకాయల గోపాల్రావు, వెలగపూడి గ్రామ అధ్యక్షుడిగా ఇడుపులపాటి వెంకయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వధూవరులకు పెళ్లికానుక అందజేత



పెళ్లికానుక అందిస్తున్న వీరిశెట్టి శ్రీనివాస్ తదితరులు

తాడేపల్లి (చిర్రావూరు), మే 12 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం చిర్రావూరు గ్రామంలో నారంశెట్టి గోపి కుమారుడి వివాహానికి హాజరై వధూ వరులు నాగ వెంకటలక్ష్మి - అవినాష్‌లకు మంత్రి లోకేశ్ పంపిన పెళ్లి కానుకను ఏఎంసీ డైరెక్టర్ వీరిశెట్టి శ్రీనివాస్ తదితరులు అందజేసి వధూ వరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు స్థానిక టీడీపీ నేతలు పాల్గొని వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

శివాలయంలో మృత్యుంజయ పాశుపత హోమం



హోమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

మంగళగిరి సిటీ, మే 12(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని, పాకిస్తాన్‌పై యుద్ధంలో భారత్ విజయం సాధించాలని కోరుతూ బీజేపీ నేత డాక్టర్ మునగపాటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం మంగళగిరి శివాలయంలో మృత్యుంజయ రుద్ర పాశుపత హోమం నిర్వహించారు. భారతదేశం సస్యశ్యామలంగా ఉండాలని, ప్రధాని నరేంద్ర మోదీ చేపట్టే పనులన్నీ విజయవంతం కావాలని నేతలు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పంచుమర్తి ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు మునగాల నాగేశ్వరరావు, నేతలు తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జగ్గారపు శ్రీనివాసరావు, తుమ్మా శ్యామ్, దామర్ల దుర్గారావు, అందె శివశంక రరావు, మునగపాటి రమేష్, జాన్‌బాబు, కొల్లి బాబూరావు, కిరణ్, మణి కంఠ, అద్దంకి శ్రీను పాల్గొన్నారు.

లేమల్లెపాడులో ముగిసిన ఆరాధనోత్సవాలు

వట్టిచెరుకూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లేమల్లెపాడులోని వరాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆరాధనోత్సవాలు సోమ వారం కలశపూజ, కల్యాణ మహోత్సవం, నగరోత్సవంతో ముగిశాయి. కల్యాణ మహోత్స వం సందర్భంగా తొలుత వేద పండితుల మంత్రోచ్చారణలతో కలశపూజ, మండపారాధన, సర్పహోమం, శాంతి పూజల అనంతరం స్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి నగరోత్సవం, రాత్రికి స్వామి తెప్పోత్సవం, పవళింపు సేవలతో ఆరాధనోత్స వాలు ముగిశాయని దేవాలయ చైర్మన్ సిద్ధాంతి రాఘవ వివరించారు. కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు తరలివచ్చిన మహిళలతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసి పోయింది.

తాగునీటికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి

- నాగులపాడు గ్రామస్థుల వినతి

పెదనందిపాడు, మే 12 (ఆంధ్రజ్యోతి): తాగునీరు లేక ఆరు రోజులుగా ఇబ్బందులు పడుతున్నామని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని నాగులపాడు గ్రామస్థులు అధికారులను సోమవారం కోరారు. తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టీపట్టనట్లు ఉన్నారని, ఇలా అయితే ఎలా అని ప్రశ్నించారు. ప్రజలు వచ్చి అడిగితే కానీ పట్టించుకోరా అంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాగు, సాగునీటిపై సీఎం, డిప్యూటీ సీఎంలు ప్రత్యేక సమీక్షలు నిర్వహించి గ్రామాల్లో వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని సూచించినప్పటికీ అధికారుల్లో ఎలాంటి చలనం లేదని వాపోయారు. దీనిపై స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సీహెచ్ రాజేష్, ఈవోపీఆర్డీ వర్ధిని మూడు గ్రామాలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా మంగళవారం నుంచి తాగునీరు సరఫరా చేస్తామని తెలిపారు.

ఉండవల్లిలో పారిశుధ్య కార్మికుల నిరసన

తాడేపల్లి (ఉండవల్లి), మే 12, (ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్‌లను ఉపసంహ రించుకోవాలని కోరుతూ ఉండవల్లిలో సోమవారం పని విరామ సమయంలో మున్సిపల్ కార్మికులు నిరసన తెలిపారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాజధాని డివిజన్ అధ్యక్షుడు ఎం రవి పాల్గొని ప్రసంగిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

మండలంలో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా

- ఎండీయూ ఆపరేటర్లపై కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు

వట్టిచెరుకూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా, రైస్ మిల్లుల్లో నిల్వలు, అధిక ధరలకు పంచదార పంపిణీ చేస్తున్నారని ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకొనే వారే లేకుండా పోయారని ముట్లూరు గ్రామానికి చెందిన పాలె వాసు సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఫిర్యాదు రసీదును విలేకరులకు విడుదల చేశారు. మూడు నెలలుగా అధిక ధరలకు పంచదార సరఫరా చేస్తున్నారని ఎండీయూ ఆపరేటర్లే పీడీఎస్ మాఫియాకు సహకరిస్తున్నా మండల అధికారులు గానీ, సివిల్ సప్లయిస్ అధికారులు పట్టించుకోవటం లేదని, విచారణకు వస్తే ఫిర్యాదు దారుడికి సమాచారం ఇవ్వకుండా ఎండీయూ ఆపరేటర్లకు అనుకూలంగా రిపోర్టు తయారు చేసి మమ అనిపిస్తూ ఫిర్యాదులను బుట్టదాఖలు చేస్తున్నారని తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

సీసీ రోడ్డుపై విచారణ జరిపించాలి

గుంటూరు(తూర్పు), మే 12(ఆంధ్రజ్యోతి): నిబంధనలను ఉల్లంఘించి సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్నారని, దీంతో ఇబ్బందులు పడాల్సి వస్తుందని తాడికొండ గ్రామానికి చెందిన కనగాల పూర్ణచంద్రరావు, స్రవంతి సోమవారం కలెక్టరేట్‌లో అర్జీ అందజేశారు. తమ స్థలం వద్దకు వచ్చేసరికి డ్రెయిన్ నిర్మాణానికి అవకాశం లేకుండా రోడ్డును నిర్మించారని వాపోయారు.

వైభవంగా శ్రీసుదర్శన హోమం

దుగ్గిరాల, మే 12 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శ్రీసుదర్శనహోమం వైభవంగా నిర్వహించారు. అర్చకులు సాకేత్ , రామచంద్రల నేతృత్వంలో ఆలయ ఆవరణలో శ్రీసుదర్శన హోమం పలువురు దంపతులతో జరిపించారు. వైశాఖ పౌర్ణమి సందర్భంగా, తెల్లవారు జామునే స్వామికి అభిషేకాలు జరిపిన అనంతరం, భక్తులు ఉత్సవమూర్తుల తో ఆలయప్రదక్షిణ చేశారు. హోమంలో పాల్గొన్న దంపతులతో పాటు భక్తులందరికి చక్రస్నానం చేయించారు. హోమాన్ని తిలకించేందుకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

ముగిసిన శ్రీనాగేశ్వరస్వామి కల్యాణోత్సవాలు



స్వామివారి గ్రామోత్సవం, మండపం వద్ద పూజా కార్య క్రమంలో పాల్గొన్న దంపతులు

దుగ్గిరాల, మే 12(ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలలోని శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీనాగేశ్వర స్వామి కల్యాణోత్సవం ముగింపు కార్యక్రమాలు సోమవారం ఘనంగా జరిగాయి. ఆలయ అర్చకుడు నాగేశ్వరం యుగంధర్‌శర్మ నేతృత్వంలో ఉదయం గం.6.15ని.లకు నిత్యహోమం, పూర్ణాహుతి, వసంతోత్సవం నిర్వహించారు. సాయంత్రం గం.7.45 ని.లకు ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. గం.8.30ని.లకు భక్తులందరికీ మంత్రపుష్పం ఇచ్చి, తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. నాలుగు రోజులపాటు జరిగిన కల్యాణోత్సవాల్లో దంపతులు వాసిరెడ్డి సుధాకర్, పద్మలతో పూజా కార్యక్రమాలు జరిపించారు. ఈవో శ్రీనివాసవర్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

మంగళగిరి, మే 12 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలపరిధిలోని గ్రామాల్లో వివిధ రకాల ప్రభుత్వ భూముల్లో ఇళ్లు వేసుకుని నివాసం ఉంటున్న పేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈమని అప్పారావు కోరారు. అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి వినతిపత్రం, అర్జీలు అందజేశారు. అప్పారావు మాట్లాడుతూ ఆత్మకూరు గ్రామంలోని నిమ్మగడ్డ రామ్మోహన రావు నగర్, వైఎస్సార్ నగర్, కాజ గ్రామంలోని పుల్లయ్య నగర్, చినకాకాని గ్రామంలో వివిధ రకాల భూముల్లో నివాసం ఉంటున్న పేదలకు ఇళ్ల పట్టా లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీ బాలకృష్ణ, నేతలు వీసం జవహర్‌లాల్, రామారావు, వెంకటేశ్వరరావు, దుర్గారావు, బాబూ వరప్రసాద్, సీతారామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

భారత సైనికుల క్షేమం కోరుతూ పూజలు


పూజలు నిర్వహిస్తున్న బీజేపీ, జనసేన శ్రేణులు

తెనాలి రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): భారత సైనికుల క్షేమం కోరుతూ పూజలు నిర్వహించారు. మండలంలోని కొలకలూరులోని అగస్త్యేశ్వరస్వామి వారి ఆలయంలో బీజేపీ, జనసేన, గణేష్ యూత్ ఆధ్వర్యంలో స్వామివార్లకు అభిషేకాలు జరిపి ప్రత్యేక పూజలు చేశారు. దేశంకోసం అహర్నిశలు శ్రమించే సైనికులకు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించి యుద్ధం కొనసాగితే విజయం సిద్ధించేలా చూడాలని వేడుకున్నారు. బీజేపీ నాయకులు అత్తులూరి బ్రహ్మయ్య, జనసేన పార్టీ మండల కార్యదర్శి తుపాకుల మణిహరినాయుడు, తుపాకుల రమేష్‌బాబు, ప్రసాద్, అడుసుమల్లి దుర్గా, గద్దెప్రశాంతి, ఝాన్సిలక్ష్మి, శ్రీకాంత్, సాయి. యశ్వంత్‌సాయి, హరి ధ్రువ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తవ్వి వదిలేశారు..

● తాగునీరు అందని వైనం


గంగానమ్మపేట నాళంవారి వీధిలో పైపులైను కోసం తవ్వి వదిలేసిన గుంత

తెనాలి అర్బన్, మే 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గంగానమ్మపేట నాళం వారి వీధిలో పైపులైను మరమ్మతుల కోసం నెల రోజుల క్రితం తవ్వారు. ఆ ప్రాంతంలో నివాసం ఉంటున్న వారికి కుళాయి కనెక్షన్ ఇచ్చారు. తాగునీరు సరిగా రాకపోవడంతో స్థానికుల ఫిర్యాదు మేరకు పైపులైను ఉన్న చోట తవ్వారు. రోడ్డు ఎంత వెడల్పు ఉందో అంత మేరకు తవ్వి వదిలి వేయడంతో తాగునీరు రాకపోగా రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వృద్ధులు, వికలాంగులు ఆటోలో వెళ్లడానికి పోయేమార్గం లేకపోవడంతో నడిచి వెళ్లాల్సి వస్తోంది. కనీసం కూరగాయల బండ్లు కూడా ఈ గుంత వలన రావడం లేదని మహిళలు వాపోతున్నారు. సంబంధిత అదికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రీ స్కూల్ సంసిద్ధత మేళా

తెనాలిరూరల్, మే 12(ఆంధ్రజ్యోతి): తెనాలి ప్రాజెక్టు అంగలకుదురు సెక్టార్ పెదరావూరు-7 సెంటర్‌లో ప్రీ స్కూల్ సంసిద్ధత మేళా కార్యక్రమం నిర్వహించారు. సోమవారం గ్రామంలోని చినపల్లె కమ్యూనిటీ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా ఐటీసీ ప్రథమ కోఆర్డినేటర్ స్వాతి, సెక్టార్ సూపర్‌వైజర్ కేవీ రమణలు పాల్గొని చిన్నారుల తల్లిదండ్రులకు ప్రీస్కూల్ ప్రాముఖ్యతను వివరించారు. 15మంది పిల్లలకు 6అభివృద్ధులపై వివరించారు. కార్యక్రమంలో జగ్గడిగుంటపాలెం, పెదరావూరు అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారుల తల్లులు, కిషోర బాలికలు పాల్గొన్నారు.

అధ్వానంగా పంట కాల్వలు

● పట్టించుకోని అధికారులు


కొల్లిపర సమీపంలో అధ్వానంగా ఉన్న బూత్‌మిల్లి కాల్వ

కొల్లిపర, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో వేలాది ఎకరాల్లో సాగునీరందించే పంట కాల్వలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. పంట కాల్వలు సంవత్సరాల తరబడి ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో అధ్వాన స్థితికి చేరుకున్నాయి. ఫలితంగా చివరి భూములకు నీరందడం గగనంగా మారుతోంది. ఖరీఫ్ తరుణం సమీపిస్తున్నా కాల్వలు బాగు చేయకపోవడంతో వాటి గతి ఇంతేనా అని రైతులు విమర్శిస్తున్నారు. మండలంలో జూన్ నెలలో ఖరీఫ్ ప్రారంభం కానుంది. కాని ఇప్పటివరకు కాల్వల మరమ్మతుల గురించి అధికారులు పట్టించుకోక పోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ వేసవిలోనైనా పంట కాల్వలు, మురుగు కాల్వలను అధికారులు మరమ్మతులు చేపడతారని రైతులు ఆశించారు. అయితే వారి ఆశలు అడియాశలు అవుతున్నాయి. ఆధునికీకరణ మాట అలా ఉన్న కనీసం మరమ్మతులకు కూడ నోచుకోకపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. పంట కాల్వల మరమ్మతుల గురించి పట్టించుకోకపోవడంతో ఏటా వేలాది ఎకరాల్లోని పంట మునిగిపోతోంది. మండలంలో చెముడుబాడు సమీపంలో వరహాపురం చానల్, కొల్లిపర సమీపంలో బూతుమిల్లి కాల్వ గురించి పట్టించుకున్న వారే లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రెండు కాల్వలు పూర్తిగా పూడిపోవడంతో పాటు కాల్వలు కుచించుకుపోయాయి. ఇరు పక్కల ఏర్పాటుచేసిన కట్టలు కూడా పూర్తిగా దెబ్బతిన్నాయి. అనేక పర్యాయాలు కాల్వల మరమ్మతుల గురించి అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా ఏ పంట కాల్వ చూచినా పిచ్చి మొక్కలతో, తూడికాడతో నిండిపోవడంతో ప్రతి సంవత్సరం రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి పంట కాల్వలకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.


కొల్లిపర మండలం దావులూరిపాలెం సమీపంలో పిచ్చిమొక్కలతో నిండిపోయిన పంట కాల్వ

పేద ప్రజల సంక్షేమం, అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

● రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్ పక్కన ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ్‌తేజ, సబ్ కలెక్టర్ సంజనాసింహ

కొల్లిపర, మే 12 (ఆంధ్రజ్యోతి): పేదప్రజల సంక్షేమం, అభ్యున్నతే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. సోమవారం మండల కేంద్రం కొల్లిపర శ్రీజనార్ధనస్వామి ఆలయం సమీపంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కర వేదిక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి తహసీల్దార్ సిద్ధార్థ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కర వేదికలో వచ్చిన ప్రతి సమస్యను వారం రోజుల్లో పరిష్కరించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం పేదప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి నెల 9వేల 600 మందికి రూ.40కోట్లు రూపాయలు పింఛన్లు ఇస్తున్నట్లు తెలియజేశారు. కొల్లిపర మండలంలో రైతులకు సంబంధించి డొంకరోడ్లు అభివృద్ధి కోసం రూ.10కోట్లు తీసుకురావడం జరిగిందన్నారు. రైతులకు మంచి జరగాలనే ఉద్దేశంతో మొట్టమొదటగా కొల్లిపర మండలంలో ధాన్యం కోనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో పాటు ధాన్యాన్ని కొనుగోలుచేసిన 24గంటల్లో రైతుల ఖాతాల్లో రూ.12వేల కోట్ల నగదును జమ చేసినట్లు చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా పెట్టుకుని దావులూరు అడ్డరోడ్డు నుంచి కొల్లిపర వరకు రోడ్డును విస్తరణ చేయడంతో పాటు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయటానికి ఇప్పటికే ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడటం జరిగిందని తెలిపారు. గ్రామాల్లో రోడ్లు ఆక్రమణకు గురైతే పంచాయతీరాజ్ శాఖ ద్వారా తగిన చర్యలు తీసుకోనున్నట్లు తెలియజేశారు. పారిశుద్యం విషయంలో ప్రతి గ్రామంలో ప్రజలు భాగస్వామ్యం కావాలన్నారు. గతంలో స్పీకర్‌గా ఉన్నప్పుడు రక్షిత తాగునీటి పథకానికి పెద్దపీట వేసినట్లు తెలిపారు. గ్రామాల్లో దొంగతనాలు పెరిగిపోవడం వలన పోలీసుశాఖపై ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. దొంగతనాలు అరికట్టడానికి పోలీసుశాఖ ద్వారా గట్టి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. యువత గంజాయికి అలవాటుపడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. నెల రోజుల లోపు గంజాయిని అరికట్టనున్నట్లు తెలియజేశారు. అదే విధంగా రాష్ట్రవ్యాప్తంగా 4వేల సంక్షేమ వసతి గృహాలకు సన్న బియ్యాన్ని సరఫరా చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పిల్లి రాధిక, ఎంపీపీ భీమవరపు పద్మావతి, ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ్‌తేజ, సబ్‌కలెక్టర్ సంజనాసింహ, ఎంపీడీవో విజయలక్ష్మి, మండల, జిల్లాకు సంబంధించిన వివిధ శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

తెనాలి పురపాలక సంఘానికి ఒక అర్జీ

తెనాలి, మారీసుపేట,మే 12 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘం కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు రోడ్డు నిర్మించాలని ఒక అర్జీ వచ్చిందని మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. సోమవారం పట్టణ పురపాలక సంఘం కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న అధికారులతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇంజనీరింగ్ సెక్షన్‌కు రోడ్డు, కాల్వలు నిర్మించాలని ఒక అర్జీ వచ్చిందన్నారు. కార్యక్రమంలో పురపాలక సంఘ పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● తెనాలి అర్బన్: సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఏడు దరఖాస్తులు అందించారు. రెవెన్యూశాఖకు సంబంధించి ఐదు, పోలీస్, హౌసింగ్ శాఖలకు సంబంధించి ఒక్కో దరఖాస్తు అందాయని సంబంధిత అధికారులతో సమస్య పరిష్కరిస్తామని కార్యాలయ అధికారులు తెలిపారు.

● తెనాలి రూరల్: ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఆరు అర్జీలు అందినట్లు తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ తెలిపారు. అందులో నాలుగు సర్వేకు రాగా రెండు విద్యుత్ సమస్యలపై వచ్చాయన్నారు. త్వరితగతిన పరిష్కరించేలా కృషి చేస్తానని తహసీల్దార్ స్పష్టం చేశారు.


శ్రీ పేరంటాళ్లమ్మ ఆలయం వద్ద శిడిమాను ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా పేరంటాళ్లమ్మ తిరునాళ్ల

కొల్లిపర, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో దావులూరులోని బాపమ్మ పేరంటాళ్ళమ్మ తిరునాళ్ల మహోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. 519 సంవత్సరాల చరిత్ర కలిగి విశేష పూజలందుకుంటున్న శ్రీబాపమ్మ పేరంటాళ్లమ్మ తిరునాళ్లకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి, అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులను తీర్చుకున్నారు. మహిళలు పొంగళ్లు పొంగించి, పసుపు కుంకుమలతో పూజలు చేశారు. అఖండజ్యోతి, పంచామృతాలతో రోకళ్లతో పూజ, గుమ్మడిశిడి, విగ్రహాల గ్రామోత్సవం, మేకశిడి, విద్యుత్ దీపాలంకరణ తిరునాళ్ళలో ప్రత్యేకత సంతరించుకున్నాయి. అమ్మవారి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవాన్ని చూడటానికి మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. రైతులు పశువులను, ట్రాక్టర్లను ఆలయం చుట్టూ తిప్పి మొక్కుబడులను తీర్చుకున్నారు. తిరునాళ్ళ సందర్భంగా గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొంది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగుకుండా ఎస్‌ఐ కోటేశ్వరరావు పోలీసు బందోబస్తును నిర్వహించారు.

చోరీ కేసులో నిందితులకు రిమాండు


పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనంతో నిందితులు

తెనాలిరూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం చోరీకేసులో ఇద్దరు నిందితులకు న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. గత నెల 30న మండలంలోని కఠెవరం గ్రామానికి చెందిన సాయికృష్ణ పల్సర్ బైక్ చోరీకి గురైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు సోమవారం కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన అబూకర్ బేగ్, బాలగంగాధర్ తిలక్‌లను అరెస్ట్ చేసి బైక్‌ను రికవరీ చేశారు. నిందితులను కోర్టు ముందు హాజరుపర్చగా న్యాయమూర్తి 15 రోజులు రిమాండ్ విధించారు. నిందితులపై గతంలో గుడివాడ, హనుమాన్‌జంక్షన్, రాజమండ్రి టౌన్ తదితర పోలీస్ స్టేషన్లో పలు నేరాల్లో నిందితుడిగా ఉండి జైలుశిక్ష అనుభవించి వచ్చినట్లు రూరల్ ఎస్‌ఐ ఆనంద్ పేర్కొన్నారు. చట్టవ్యతిరేక కార్యకలపాలకు పాల్పడితే కఠినశిక్షలు తప్పవని ఎస్‌ఐ ఆనంద్ హెచ్చరించారు. రూరల్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించండి

● మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న శానిటేషన్ సిబ్బందితో అన్నారు. సోమవారం స్థానిక మారీసుపేట ఒకటో డివిజన్‌లో జరుగుతున్న శానిటేషన్ పనులను మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కాలువలో పేరుకొని ఉన్న వ్యర్థాలను గమనించి అధికారులను ప్రశ్నించారు. వెంటనే వ్యర్థాలను తొలగించి మురుగునీటి పారుదలకు అడ్డంకులను తొలగించాలని ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేదిలేదని వారిపై శాఖపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కమిషనర్ మాట్లాడుతూ అభివృద్ధి పనులలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలన్నారు. ప్రజలందరి సహకారంతో తెనాలిని అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. అనంతరం పట్టణంలో పలు వార్డుల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మురళీనాయక్‌కు ఘన నివాళి


మురళీనాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శ్యాంప్రసాద్ తదితరులు

తెనాలి అర్బన్, మే 12 (ఆంధ్రజ్యోతి): యుద్ధంలో ప్రాణత్యాగం చేసిన సైనికుడు మురళీనాయక్‌కు డబుల్ హార్స్ సంస్థ యాజమాన్యం, సిబ్బంది నివాళులర్పించారు. ఆటోనగర్‌లోని సంస్థ కార్యాలయంలో సోమవారం మురళీనాయక్ చిత్రపటాన్ని ఏర్పాటుచేసి నివాళులర్పించారు. పాకిస్థాన్‌తో జరుగుతున్న యుద్ధంలో మృతిచెందడం బాధాకరమని సైనికులు దేశ రక్షణలో నిమగ్నం కావడంవల్లే ప్రజలంతా సుఖంగా ఉంటున్నారని సంస్థ ఎండీ మునగాల మోహన్‌శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. జనరల్ మేనేజర్ ఎన్‌వీ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, మురళీనాయక్ మృతి రాష్ట్ర ప్రజలను తీవ్రంగా బాధించిందన్నారు. ఆయన ధైర్య సాహసాలు జాతికి స్ఫూర్తినిస్తాయని చెప్పారు. దేశ సమగ్రతను, సమైక్యతను సైన్యం కాపాడుతుందన్నారు.


వసతి గృహంలో దోమల నివారణకు మందును పిచికారి చేస్తున్న మలేరియా సిబ్బంది

వసతిగృహాల్లో దోమల నివారణకు చర్యలు

తెనాలి, మారీసుపేట,మే 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు వసతి గృహాలలో దోమల నివారణకు మలేరియా అధికారులు చర్యలు చేపట్టారు. సోమవారం స్థానిక రావి రవీంద్రనాథ్ నగర్‌లోని ఆంధ్రప్రదేశ్ గిరిజన బాలికల వసతి గృహం, షెడ్యూల్ కులాల బాలికల వసతి గృహాలలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా దోమల నివారణకు పట్టణ మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలించి సిబ్బందితో మలాథియాన్ మందును పిచికారి చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు వసతి గృహాలలోని విద్యార్థులకు రాకుండా ఉండేందుకు ముందు జాగ్రత్త చర్యలను చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్ర మౌళి, ఆరోగ్య పర్యవేక్షకులు దీపాల శ్రీనివాసరావు, బండారు మల్లేశ్వరావు, దాసరి శివనాగమల్లేశ్వరావు, ఆరోగ్య కార్యకర్తలు నవీద్, రషీద్, వార్డు హెల్త్ సెక్రటరీలు రాజ్యం, ఆశా కార్యకర్త శ్యామల, యశోద పాల్గొన్నారు.


బస్టాండు, రైల్వే స్టేషన్లలో బ్యాగులను తనిఖీ చేస్తున్నసీఐ రాముల నాయక్, పోలీసు సిబ్బంది

తెనాలిలో పోలీసుల తనిఖీలు

తెనాలి, మారీసుపేట,మే 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలు ప్రాంతాలలో పోలీసులు అనుమానాస్పద వ్యక్తులను, వాహనాలను తనిఖీలు చేశారు. తెనాలి పట్టణంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాలతో ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్, వాహనాలు, పలు లాడ్జిలలో ఆదివారం రాత్రి పోలీసు అధికారులు తనిఖీలను నిర్వహించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అసాంఘిక శక్తుల చర్యలను అరికట్టడానికి అనుమానాస్పద వ్యక్తులు, ప్రయాణికులు, అనుమానితుల బ్యాగులను, వాహనాలను పరిశీలించి వారి చిరునామాలను నమోదు చేశారు. మరికొందరి వేలిముద్రలను పోలీసులు సేకరించారు. కార్యక్రమంలో టూటౌన్ సీఐ రాముల నాయక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అన్నమయ్య జయంతి ఉత్సవాలు

తెనాలి అర్బన్, మే 12 (ఆంధ్రజ్యోతి): బోసురోడ్డులోని గీతా మందిరంలో తాళ్లపాక అన్నమాచార్య జయంతోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. శ్రీవేంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన బృందం ఆధ్వర్యంలో స్వామి వారిని కీర్తించారు. ఈ నెల 4న జరిగిన పాటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. జ్యోతిష్య పండితులు రాళ్లబండి చంద్రశేఖర్, నృత్యగురువు చల్లా యామిని, సంగీత గురువు కామిశెట్టి పావనిలను సన్మానించారు. విష్ణుబొట్ల యజ్ఞరామకృష్ణ, పంచాంగం రామానుజచార్యులు, ఆంజనేయశాస్త్రి, కమల, సుజాత, టీవీఎస్‌శాస్త్రి, సుబ్బారావు, నరసింహారావు, అప్పారావు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం

● రథోత్సవానికి హాజరైన అశేష భక్తజనం
● తొలిపూజలు నిర్వహించిన అనువంశికులు




రథోత్సవంలో పాల్గొన్న భక్తులు, ఇన్‌సెట్‌లో సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత భావన్నారాయణస్వామి ఉత్సవ మూర్తులు

పొన్నూరు టౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు సాక్షి భావన్నారాయణస్వామి దివ్య రథోత్సవం సోమవారం పొన్నూరు పట్టణంలో వైభవంగా జరిగింది. వేకువజామున స్వామివారి కల్యాణ మహోత్సవం ఆలయ అనువంశిక ధర్మకర్త రాజా వాసిరెడ్డి, సుధాస్వరూప్ బహద్దూర్ మన్నేసుల్తాన్‌దొర ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం గరుడ వాహనంపై కొలువుదీరిన సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత భావన్నారాయణస్వామి ఉత్సవ మూర్తులు పురవీధుల్లో ఊరేగారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన రథవాహనంపై స్వామి వారి ఉత్సవ మూర్తులను అర్చక స్వాములు ప్రతిష్ఠించారు. మేజర్ వీటీ చౌదరి వంశస్థులు తొలిపూజలు నిర్వహించిన అనంతరం పురవీధుల్లో రథోత్సవం అశేషజనవాహిని మధ్య సాగింది. రథోత్సవంలో పాల్గొనేందుకు, వీక్షించేందుకు పొన్నూరు పరిసర ప్రాంతాల నుంచే కాకుండా జిల్లా నలుమూలల నుంచి భక్తులు విచ్చేశారు. కులమతాలకు అతీతంగా రథోత్సవంలో భక్తులు పాల్గొని భావన్నారాయణస్వామిని పూజించారు. ఈ సందర్భంగా పొన్నూరు పట్టణంలో పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు, శీతల పానీయాలు పంపిణీ చేపట్టారు. మానవతా సంస్థ ఆర్యవైశ్య సంఘం, రేషన్ డీలర్స్ అసోసియేషన్, ఐడీఎల్ కాన్వెంట్ పూర్వపు విద్యార్థులు, ముస్లిం మైనార్టీల పరిరక్షణ సమితి, వాసవీ క్లబ్ వంటి పలు స్వచ్ఛంద సంస్థలు రథోత్సవంలో పాల్గొన్న భక్తులకు పులిహోర, చక్కెర పొంగలి, మజ్జిగ, తాగునీరు, శీతల పానీయాలు అందజేశారు. స్వామి వారి దివ్యరథోత్సవం సందర్భంగా జీబీసీ రోడ్డు నుంచి ట్రాఫిక్‌ను మళ్లించారు. తెనాలి డీఎస్పీ జనార్దనరావు పర్యవేక్షణలో పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు. రథోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన బొమ్మల దుకాణాలు, ఎగ్జిబిషన్‌తో సందడి వాతావరణం నెలకొంది. పురవీధులు భక్తుల గోవింద నామస్మరణతో పులకించిపోయాయి. రథోత్సవాన్ని వీక్షించేందుకు రోడ్లకి ఇరువైపులా ఉన్న భవంతిలపైకి చేరిన వృద్ధులు, మహిళలు రథవాహనంపై పూలు చల్లారు. రథవాహనం పాత పొన్నూరు వరకు వెళ్లి తిరిగి ఆలయానికి చేరుకోవడంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది.

వెల్లివిరిసిన మతసామరస్యం

పొన్నూరు టౌన్, మే 12(ఆంధ్రజ్యోతి): పొన్నూరు భావన్నారాయణస్వామి రథోత్సవం సందర్భంగా మతసామరస్యం వెల్లివిరిసింది. ముస్లిం మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో రథోత్సవానికి విచ్చేసే భక్తులకు గాంధీ బొమ్మసెంటర్‌లో సోమవారం మజ్జిగ, తాగునీరు, శీతలపానీయాల పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పరిరక్షణ సమి తి రాష్ట్ర అధ్యక్షుడు ఫారుక్ షుబ్లీ హాజరయ్యా రు. భక్తులకు స్వయంగా మజ్జిగ, తాగునీరు అందజేసి రథోత్సవంలో పాల్గొన్నారు. రథోత్సవంలో పాల్గొన్న వేలాది మంది భక్తులకు నిరంతరాయంగా మజ్జిగ సరఫరా చేశారు. వేలాదిమంది హిందూ భక్తులు పరిరక్షణ సమితి స్టాల్ వద్దకు చేరుకుని ఫారుక్ షుబ్లీ చేతులమీదుగా ద్రవపదార్థాలు అందుకునేందుకు ఆసక్తి చూపారు. ము స్లింలు రథోత్సవంలో పాల్గొని హిందూ భక్తులకు సేవలం దించటంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. కార్యక్రమం లో ముస్లిం నాయకులు స య్యద్ జాఫర్, పఠాన్ ఫిరోజ్‌ఖాన్, మహ్మద్‌గౌస్ తదితరు లు పాల్గొన్నారు.


మంచినీరు మజ్జిగ పంపిణీ చేస్తున్న ఫారుక్ షుబ్లీ